

TGTEL/25/A2394

# ప్రజాక్షేత్రం

PRAJA KSHETRAM

ప్రతీ క్షణం.. ప్రజల పక్షం

సంపుటి: 03 | సంచిక: 26 | హైదరాబాద్ | సోమవారం | 13-07-2026 | పేజీలు: 08


## హింసను ప్రేరేపించేలా రేవంత్ వ్యాఖ్య-

- మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శలు
- హిట్లర్ తనకు ఆదర్శమని గతంలో రేవంత్ చెప్పారని విమర్శ
- ప్రజా సమస్యలపై సమాధానం చెప్పలేక వ్యక్తిగత వ్యాఖ్యలంటూ ఆరోపణ
- నిన్న చేసిన వ్యాఖ్యలపై సీఎం బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్
- షాబాద్ ఘటనపై తెలంగాణ సీఎం స్పందించకపోవడం బాధాకరమని వ్యాఖ్య
- కాళేశ్వరం ప్రాజెక్టుపై సీఎంకు ఇప్పటికీ సరైన అవగాహన లేదని విమర్శ
- మేడిగడ్డ వద్ద నీటిని ఎత్తిపోసే అవకాశం ఉన్నా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపణ
- రైతులకు సాగునీరు అందించకుండా ప్రతిపక్షాలను లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆగ్రహం
- ఎల్లంపల్లి నీటి విషయంలో రాజకీయాలు చేస్తే రాష్ట్రానికి నష్టం తప్పదని హెచ్చరిక
- మేడిగడ్డపై సీఎం చేస్తున్న వ్యాఖ్యలు వాస్తవాలకు విరుద్ధమని స్పష్టీకరణ



**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల చేసిన వ్యాఖ్యలు హింసను ప్రేరేపించేలా ఉన్నాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు హరీశ్‌రావు తీవ్ర విమర్శలు చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తి సంయమనంతో వ్యవహరించాల్సిన అవసరం ఉందని, కానీ రేవంత్‌రెడ్డి అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. గతంలో హిట్లర్ తనకు ఆదర్శమని రేవంత్‌రెడ్డి స్వయంగా చెప్పారని, ఇప్పుడు కూడా అదే తరహా భాషను ఉపయోగిస్తూ రాజకీయ ప్రత్యర్థులను లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆరోపించారు.

తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ, ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అంశాలపై మాట్లాడకుండా వ్యక్తిగత విమర్శలు, అనుచిత వ్యాఖ్యలతో సీఎం దృష్టి మళ్లించే ప్రయత్నం మిగతా 2లో..

## నీళ్లు అడిగితే నెత్తురు చల్లుతావా..

- సీఎం రేవంత్‌పై కేటీఆర్ మండిపాటు
- రైతుల సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ విఫలం
- అన్నదాతలకు సాగునీరు అందించడంలో నిర్లక్ష్యం ఎందుకని ప్రశ్న
- తెలంగాణ అభివృద్ధికి కాంగ్రెస్ చేసిన సేవలేంటో చెప్పాలని సవాల్
- తెలంగాణ ఉద్యమంలో కాంగ్రెస్ పాత్రపై కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు
- 1952, 1969 ఘటనలను ప్రస్తావిస్తూ కాంగ్రెస్‌పై విమర్శలు
- మలిదశ తెలంగాణ ఉద్యమంలో ప్రాణత్యాగాలను గుర్తు చేసిన కేటీఆర్
- రైతుల కోసం ఎంతటి త్యాగానికైనా సిద్ధమని స్పష్టం
- జలసాధన కోసం బీఆర్ఎస్ చేసిన పోరాటాలను గుర్తు చేసిన మాజీ మంత్రి
- ఎండిపోతున్న పంట పొలాలకు వెంటనే నీరు విడుదల చేయాలని డిమాండ్
- ఎక్స్ వేదికగా సీఎం రేవంత్‌రెడ్డిపై విమర్శల వర్షం కురిపించిన కేటీఆర్



**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) తీవ్ర విమర్శలు చేశారు. రైతన్నల కోసం నీళ్లు అడిగితే తమపై ఆరోపణలు చేయడం సరికాదని మండిపడ్డారు. రాష్ట్రంలోని అన్నదాతల సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా కేటీఆర్ వరుస పోస్టులు చేశారు. తెలంగాణను దశాబ్దాల పాటు పాలించిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అభివృద్ధికి ఏం చేసిందో ప్రజలకు చెప్పాలని కేటీఆర్ ప్రశ్నించారు. తెలంగాణ కోసం పోరాడిన యువతపై మిగతా 2లో..

## సైకో కిల్లర్ ఎక్కడ?

- షాబాద్ హంతకుడు రాజ్‌కుమార్ వేటలో విస్తుపోయే నిజాలు
- పెట్రోల్ అయిపోవడంతో కారును వదిలేసిన రాజ్‌కుమార్
- రైల్వే ట్రాక్‌పై ఆత్మహత్యాయత్నం విఫలం
- 3 ఫోన్లు, 12 సిమ్ కార్డులతో తప్పించుకునే ప్లాన్
- శ్రీశైలం, బెంగలూరు మార్గాల్లో పోలీసుల గాలింపు



**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురిని నరమేధం సృష్టించిన ఉదంతంలో ప్రధాన నిందితుడు రాజ్‌కుమార్ ఆచూకీ కోసం పోలీసులు జరిపిన గాలింపు చర్యల్లో అత్యంత ఆసక్తికరమైన, ఉత్కంఠభరితమైన అంశాలు వెలుగులోకి వచ్చాయి. నిందితుడిని పట్టుకోవడానికి పోలీసులు రాత్రింబగళ్లు శ్రమిస్తున్నప్పటికీ, అతను పోలీసుల కళ్లు గప్పుతూ సాగిస్తున్న తప్పించుకునే పర్వం తీవ్ర సస్పెన్స్‌ను రేకెత్తిస్తోంది.

**కారులో పెట్రోల్ ఖాళీ.. రైల్వే ట్రాక్‌పై ఆత్మహత్యాయత్నం డ్రామా**

హత్యలు చేసిన అనంతరం పోలీసుల మిగతా 2లో..

## కాళేశ్వరం అవినీతిపై చర్యలు ఎక్కడ?

- సీఎం రేవంత్‌ను ప్రశ్నించిన కిషన్‌రెడ్డి
- కేసీఆర్ కుటుంబంతో రేవంత్‌కు రహస్య సంబంధాలున్నాయని ఆరోపణ
- కాళేశ్వరం అక్రమాలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్న
- లక్ష కోట్ల రూపాయలు వసూలు చేస్తామన్న కాంగ్రెస్ హామీ ఏమైందని నిలదీత
- రాష్ట్ర ప్రభుత్వానికి విచారణ సంస్థలు లేవా? అంటూ విమర్శ
- బీజేపీ నేతలను విమర్శించే ముందు ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచన
- నేటి నుంచి రెండు రోజుల పాటు 'సింగరేణి భరోసా యాత్ర' ప్రకటించిన కిషన్‌రెడ్డి
- హైదరాబాద్ బస్తీల్లో మౌలిక వసతులపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉందని వెల్లడి
- తాగునీరు, వీధిలైట్లు, రోడ్ల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి డిమాండ్
- కాంగ్రెస్ ఎన్నికల హామీల అమలుపై ప్రజలు ప్రశ్నిస్తున్నారని వ్యాఖ్య
- పేద, మధ్యతరగతి ప్రజల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శ



**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి, తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి. కిషన్‌రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఏబీఎన్ ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ, కేసీఆర్ కుటుంబ సభ్యులతో సీఎం రేవంత్‌రెడ్డికి రహస్య సంబంధాలు ఉన్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కేసీఆర్ కుటుంబం నుంచి లక్ష కోట్ల రూపాయలు వసూలు చేస్తామని ఎన్నికల సమయంలో ప్రకటించారని, ఆ హామీ ఏమైందని ప్రశ్నించారు.

కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగినట్లు ఆరోపణలు వచ్చిన అక్రమాలు, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చోటుచేసుకున్న అవినీతి వ్యవహారాలపై ఇప్పటివరకు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని కిషన్‌రెడ్డి నిలదీశారు. రాష్ట్ర ప్రభుత్వానికి విచారణ సంస్థలు లేవా? లేక విచారణను మిగతా 2లో..

## జులై 23న ప్రజల ముందుకు మొజ్తబా ఖమేనీ

- మాజీ సుప్రీం లీడర్ స్మారక సభకు ఏర్పాట్లు
- టెహ్రాన్‌లో సాయంత్రం జరిగే కార్యక్రమం
- కీలక నేతలంతా హాజరయ్యే అవకాశం
- తొలిసారి బహిరంగంగా కనిపించనున్న మొజ్తబా
- భద్రతతోనే ప్రజల ముందుకు రానున్న నేత
- తండ్రి అంత్యక్రియలకు దూరంగా ఉన్న మొజ్తబా
- దాడిలో గాయపడినట్లు ప్రచారం
- ఇరాన్‌పై దాడులను ఖండిస్తున్న సుప్రీం లీడర్
- ప్రతీకారం తీర్చుకుంటానన్న తాజా హెచ్చరిక
- ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తున్న స్మారక సభ

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ త్వరలో ప్రజల ముందుకు రానున్నట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. జులై 23న టెహ్రాన్‌లో మాజీ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ స్మారక సభను ఆయన నిర్వహించనున్నట్లు సమాచారం. సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమానికి మిగతా 2లో..



## దేవాలయాల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి



- రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ
- ఆలయాల్లో వేల కోట్ల రూపాయల అభివృద్ధి పనులు
- బాసర నుంచి భద్రాచలం వరకు టెంపుల్ టూరిజం అభివృద్ధి
- వరంగల్ పర్యటనలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి
- గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మీసాల ప్రకాశ్ ప్రమాణ స్వీకారానికి హాజరు
- ఆధ్యాత్మిక పర్యాటకాన్ని మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యం
- దేవాలయాల అభివృద్ధితో స్థానిక ఆర్థిక వ్యవస్థకు ఊతమిస్తామని వెల్లడి
- గ్రేటర్ వరంగల్ ఎన్నికలకు కాంగ్రెస్ శ్రేణులు సిద్ధం కావాలని పిలుపు
- మేయర్ సీటు గెలుపే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో పనిచేయాలని సూచన
- ప్రజలకు చేరువయ్యేలా పార్టీ కార్యకర్తలు పనిచేయాలని ఆకాంక్ష

02

## కేసీఆర్, హరీష్ ప్రజలకు క్షమాపణ చెప్పాలి.!

- కేసీఆర్, హరీష్‌కు క్షమాపణ డిమాండ్
- కేటీఆర్ వ్యాఖ్యలపై ఘాటు కౌంటర్
- ఈటెల రాజేందర్‌పైనా విమర్శలు
- తుంగతుర్తి వివాదంపై స్పందన



**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

కాళేశ్వరం ప్రాజెక్టు , సాగునీటి అంశంపై కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్న బీఆర్ఎస్ నేతలకు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జగ్గారెడ్డి గట్టి కౌంటర్ ఇచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోవడానికి ప్రధాన కారణమైన కేసీఆర్, హరీష్ రావులు ముందు తెలంగాణ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. దాదాపు లక్ష కోట్ల రూపాయల

## హింసను ప్రేరేపించేలా రేవంత్ వ్యాఖ్యలు

మొదటిపేజీ తరువాయి

చేస్తున్నారని విమర్శించారు. నిన్న చేసిన వ్యాఖ్యలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొంటూ, వాటిపై రేవంత్‌రెడ్డి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. షాబాద్‌లో జరిగిన ఘటనపై పక్క రాష్ట్ర ముఖ్యమంత్రి స్పందించినప్పటికీ తెలంగాణ ముఖ్యమంత్రి ఇప్పటివరకు స్పందించకపోవడం విచారకరమని హరీశ్‌రావు అన్నారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల అంశాల్లో ప్రభుత్వం మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి చేస్తున్న వ్యాఖ్యలపైనా హరీశ్‌రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి 31 నెలలు పూర్తయినా కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం, పనితీరు, సాంకేతిక అంశాలపై రేవంత్‌రెడ్డికి ఇప్పటికీ సరైన అవగాహన రాలేదని విమర్శించారు. విశ్రాంత ఇంజినీర్లు, నీటిపారుదల శాఖ అధికారులు మేడిగడ్డ వద్ద నుంచి నీటిని ఎత్తిపోసే అవకాశం ఉందని చెబుతున్నప్పటికీ ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు.

రైతులకు సాగునీరు అందించే దిశగా చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం, ప్రతిపక్షాల గొంతు నొక్కే ప్రయత్నం చేస్తోందని హరీశ్‌రావు ఆరోపించారు. వాస్తవాలు మాట్లాడిన వారిని జైలుకు పంపిస్తామని బెదిరించడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. ప్రజా సమస్యలను ప్రస్తావించిన వారిపై ఒత్తిడి తీసుకురావడం కంటే, వాటి పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని సూచించారు.ఎల్లంపల్లి ప్రాజెక్టుపై హైదరాబాద్‌తో పాటు అనేక జిల్లాలు ఆధారపడి ఉన్నాయని హరీశ్‌రావు గుర్తు చేశారు. నీటి వంటి అత్యంత కీలకమైన అంశంలో రాజకీయాలు చేయడం వల్ల రాష్ట్ర ప్రయోజనాలకే నష్టం జరుగుతుందని హెచ్చరించారు. కరవు పరిస్థితులు మరింత జటిలం కాకుండా ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు.

కన్నెపల్లి పంప్‌హౌస్‌ను వెంటనే ప్రారంభించి రైతులకు అవసరమైన నీటిని అందించాలని డిమాండ్ చేసిన హరీశ్‌రావు, పంప్‌హౌస్ బటన్లు నొక్కడానికి బదులుగా ప్రభుత్వం ప్రతిపక్షాల కంఠం నొక్కడంపై దృష్టి పెట్టిందని విమర్శించారు. మేడిగడ్డ అంశంపై ముఖ్యమంత్రి చేస్తున్న వ్యాఖ్యలు పూర్తిగా అవాస్తవాలని, వాస్తవ పరిస్థితులను ప్రజలకు వెల్లడించకుండా రాజకీయ ఆరోపణలు చేయడం సరికాదని ఆయన పేర్కొన్నారు.

# కాళేశ్వరం అవినీతిపై చర్యలు ఎక్కడ?

మొదటిపేజీ తరువాయి

ఉద్దేశపూర్వకంగా అడ్డుకుంటోందా? అని ప్రశ్నించారు. బీజేపీ ఎంపీలు, ప్రజాప్రతినిధులను విమర్శించే ముందు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు.

సోమవారం నుంచి రెండు రోజుల పాటు రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు 'సింగరేణి భరోసా యాత్ర' చేపడుతున్నట్లు కిషన్‌రెడ్డి ప్రకటించారు. ఈ యాత్రలో బీజేపీకి చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొంటారని తెలిపారు.

కాచిగూడ డివిజన్‌లో నిర్వహించిన పాదయాత్ర అనంతరం మాట్లాడిన కిషన్‌రెడ్డి, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ప్రతి శనివారం, ఆదివారం బస్తీల్లో పర్యటిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకుంటున్నానని చెప్పారు. ప్రభుత్వ అధికారులు కూడా ఈ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని పేర్కొన్నారు.

అంబర్‌పేట్ అసెంబ్లీ నియోజకవర్గంలోని పలు డివిజన్లలో బస్తీలను సందర్శించిన సందర్భంగా స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నట్లు తెలిపారు. వర్షాకాలం ప్రారంభమైన తర్వాత అనేక రహదారులు దెబ్బతిన్నాయని, వీధిలైట్లు పనిచేయక బస్తీలు చీకట్లో మగ్గుతున్నాయని చెప్పారు. పలుమార్లు అధికారులకు సమాచారం ఇచ్చినా మరమ్మతు పనుల్లో జాప్యం జరుగుతోందని విమర్శించారు. తాగునీటి సమస్య కూడా తీవ్రంగా ఉందని కిషన్‌రెడ్డి అన్నారు. వర్షాకాలం వచ్చినప్పటికీ చివరి బస్తీలు, ఇళ్ల వరకు తాగునీరు అందడం లేదని, దీనిపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉందన్నారు. జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులు వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఇళ్ల నిర్మాణం, పెన్షన్ల మంజూరుపై కూడా ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని ఆయన తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్రూమ్ ఇళ్ల పేరుతో ప్రజలను మోసం చేసిందని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి చాలాకాలమైనా అర్హులకు పెన్షన్లు అందడం లేదని ప్రజలు తన దృష్టికి తీసుకొచ్చారని చెప్పారు. కాంగ్రెస్ ఎన్నికల హామీలైన మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం, నిరుద్యోగ యువతకు రూ.4,000 భృతి, యువతులకు స్కూటీలు, వివాహ సమయంలో తులం బంగారం వంటి హామీలను ప్రభుత్వం ఎప్పుడు



అమలు చేస్తుందని ప్రజలు ప్రశ్నిస్తున్నారని పేర్కొన్నారు.

హైదరాబాద్ అభివృద్ధిపైనా రాష్ట్ర ప్రభుత్వాన్ని కిషన్‌రెడ్డి విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మాదిరిగానే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా హైటెక్ సిటీ అభివృద్ధికే పరిమితమైందని ఆరోపించారు. సికింద్రాబాద్, అంబర్‌పేట్, సనత్‌నగర్, గౌలిగూడ, ఓల్డ్‌సిటీ, ఖైరతాబాద్ వంటి ప్రాంతాల్లోని పేద, మధ్యతరగతి ప్రజల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. మౌలిక సదుపాయాల కల్పనలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, అధికారులు వెంటనే స్పందించి ప్రజల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

## నీళ్లు అడిగితే నెత్తురు చల్లుతావా..

మొదటిపేజీ తరువాయి



ఎన్‌కౌంటర్లు జరిగాయని ఆరోపిస్తూ కాంగ్రెస్ పాలనను విమర్శించారు.

1952లో ఏడుగురు యువకులను కాల్చిచంపింది కాంగ్రెస్ ప్రభుత్వమే కాదా? అని ప్రశ్నించిన కేటీఆర్, 1969 తెలంగాణ ఉద్యమ సమయంలో 369 మందిపై తూటాల వర్షం కురిపించారని ఆరోపించారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలోనూ వేలాది మంది యువత ప్రాణత్యాగాలు చేశారని పేర్కొన్నారు. రైతులకు సాగునీరు అందించడంలో ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యం చేస్తోందని సీఎం రేవంత్‌రెడ్డిని కేటీఆర్ నిలదీశారు. రైతన్నల కోసం ఎంత రక్తమైనా ధారపోయడానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. తెలంగాణ సాధన కోసం నీళ్లలో నిప్పులు పుట్టించేలా జలసాధన పోరాటాలు చేశామని గుర్తు చేశారు.

రాష్ట్రంలో ఎండిపోతున్న పంట పొలాలకు వెంటనే సాగునీరు విడుదల చేయాలని కేటీఆర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుల ప్రయోజనాలే తమకు ముఖ్యమని, ఆ దిశగా బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు.

## జులై 23న ప్రజల ముందుకు మొజ్తబా ఖమేనీ

మొదటిపేజీ తరువాయి



దేశంలోని కీలక రాజకీయ, మత నాయకులు హాజరుకానున్నట్లు అధికారులు తెలిపారు.

సుప్రీం లీడర్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొజ్తబా ఖమేనీ ఇప్పటివరకు బహిరంగంగా కనిపించలేదు. భద్రతా కారణాల దృష్ట్యా తన తండ్రి అంత్యక్రియలకు కూడా ఆయన హాజరుకాలేదని సమాచారం. అలాగే రెండు వారాల క్రితం జరిగిన తన భార్య అంత్యక్రియల్లోనూ ఆయన కనిపించలేదు.

మొజ్తబా ఖమేనీకి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వారిలో ఒకరు ఫిబ్రవరి 28న జరిగిన దాడుల్లో మరణించినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. అదే దాడిలో మొజ్తబా కూడా తీవ్రంగా గాయపడగా చికిత్స పొందుతున్నట్లు తెలుస్తోంది. అప్పటి నుంచి ఇరాన్‌పై జరిగిన దాడులను ఆయన సామాజిక మాధ్యమాల వేదికగా ఖండిస్తూ వస్తున్నారు. తాజాగా శనివారం చేసిన సోషల్ మీడియా పోస్టులో తన తండ్రి మరణానికి ప్రతీకారం తీర్చుకుంటానని మొజ్తబా ఖమేనీ ప్రకటించారు. ఈ నేపథ్యంలో జులై 23న జరగనున్న స్మారక సభపై అంతర్జాతీయంగా ఆసక్తి నెలకొంది.

## తప్పిపోయిన విద్యార్థి...కేసు నమోదు

**కోటగిరి,జూలై 12(ప్రజాక్షేత్రం):**



మదర్సా నుండి 14 ఏళ్ల విద్యార్థి తప్పిపోయిన ఘటన కోటగిరి మండల కేంద్రంలో చోటుచేసుకుంది. కోటగిరి ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం... కోటగిరి మండల కేంద్రానికి చెందిన అబ్దుల్ కవీ ఈనెల 11, 2026 న ఉదయం 07:40 గంటలకు మదర్సా నుండి ఎవరికీ చెప్పకుండా వెళ్ళిపోయాడు. బాలుడి తండ్రి షేక్ అహ్మద్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. తప్పిపోయిన బాలుడిని గుర్తించడానికి పోలీసులు ఇప్పటికే ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. మదర్సా, దాని పరిసర ప్రాంతాలలోని సిసిటివి కెమెరాల ఫుటేజీని కూడా క్షుణ్ణంగా పరిశీలించారు .ఈ బాలుడి జాడ తెలిసినా లేదా అతని గురించి ఎలాంటి సమాచారం ఉన్నా, వెంటనే కోటగిరి ఎస్సై8712659878, రుద్రూర్ సీఐ 8712659875కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

# సైకో కిల్లర్ ఎక్కడ?

మొదటిపేజీ తరువాయి



నుండి తప్పించుకోవడానికి రాజ్‌కుమార్ కారులో వేగంగా పరారయ్యాడు. అయితే, చేగూరు ప్రాంతానికి చేరుకునే సరికి కారులో పెట్రోల్ అయిపోవడంతో విధిలేక వాహనాన్ని అక్కడే వదిలేశాడు. అక్కడ నుండి కాలినడకన తిమ్మాపూర్ రైల్వే ట్రాక్ వైపు వెళ్లాడు. ఆ సమయంలో అటుగా వస్తున్న ఒక రైలుకు ఎదురుగా వెళ్లి ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించాడు. కానీ, చివరి నిమిషంలో ధైర్యం సరిపోక చచ్చేందుకు భయపడి ట్రాక్ కిందకు దూకేశాడు. ఆ తర్వాత అతను అక్కడి నుండి ఎటు వైపు వెళ్లాడు, ఎక్కడ తలదాచుకున్నాడు అనేది పోలీసులకు పెద్ద సవాల్‌గా మారింది.

**3 ఫోన్లు.. డజనుకు పైగా సిమ్ కార్డులు**

రాజ్‌కుమార్ సాధారణ నేరస్థుడిలా కాకుండా పక్కా ప్లానింగ్‌తో ఉన్నట్లు దర్యాప్తులో తేలింది. అతని వద్ద సుమారు మూడు మొబైల్ ఫోన్లు, డజనుకు పైగా (12 కి పైగా) వేర్వేరు సిమ్ కార్డులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. అయితే, సాంకేతిక ఆధారాల ద్వారా పోలీసులు తనను పసిగడతారనే భయంతో ప్రస్తుతం అతను ఆ ఫోన్లను, సిమ్ కార్డులను వాడటం లేదని నిర్ధారణ అయ్యింది. అయినప్పటికీ, అత్యవసర పరిస్థితుల్లో ఎప్పుడైనా ఒక సిమ్ కార్డ్ ఆన్ చేసినా వెంటనే పట్టుకోవాలనే వ్యూహంతో పోలీసులు అతనికి సంబంధించిన అన్ని నంబర్లను ప్రతిక్షణం సైబర్ సెల్ సహాయంతో ట్రాక్ చేస్తున్నారు.

**శ్రీశైలంతో పాటు బెంగళూరు హైవేపై పోలీసుల గాలింపు**

నిందితుడి వేట కోసం పోలీసులు ఏకంగా 12 ప్రత్యేక బృందాలను (Teams) రంగంలోకి దించారు. ఇప్పటికే తిమ్మాపూర్ రైల్వే స్టేషన్‌తో పాటు పరిసర ప్రాంతాల్లోని రైల్వే స్టేషన్ల సీసీటీవీ (CCTV) ఫుటేజీలను జల్లెడ పడుతున్నారు. రాజ్‌కుమార్‌కు శ్రీశైలం పుణ్యక్షేత్రానికి రెగ్యులర్‌గా వెళ్లే అలవాటు ఉందని విచారణలో తేలడంతో.. అతను అక్కడ సాధువుల రూపంలో గానీ, భక్తుల మధ్య గానీ దాక్కునే అవకాశం ఉందని భావించి శ్రీశైలంలో ప్రత్యేక బృందాలు మోహరించాయి. దీనితో పాటు బెంగళూరు హైవే పరిసర ప్రాంతాలు , పొరుగు రాష్ట్రాలలో కూడా గాలింపు చర్యలను ముమ్మరం చేశారు.

## కేసీఆర్, హరీష్ ప్రజలకు క్షమాపణ చెప్పాలి.!

ప్రజా ధనాన్ని వృధా చేసి, రాష్ట్రానికి భారీ నష్టం చేకూర్చినందుకు గానూ ముక్కు నేలకు రాసి, ఆ తర్వాతే ఇతర విషయాల గురించి మాట్లాడాలని సవాల్ విసిరారు.

**హరీష్ రావుకు రక్తం చిందించే ధైర్యం లేదు**

రైతుల కోసం ఎంత రక్తమైనా ధారపోస్తామంటూ కేటీఆర్, హరీష్ రావు చేస్తున్న వ్యాఖ్యలను జగ్గారెడ్డి తీవ్రంగా ఎండగట్టారు. హరీష్ రావును రక్తం చిందించమని చెప్పినా ఆయన ఆ పని చేయరని, అసలు రక్తం చిందించే అంత ధైర్యం హరీష్‌కు లేదని ఎద్దేవా చేశారు. "తెలంగాణ ఉద్యమం పీక్ స్టేజ్‌లో ఉన్నప్పుడు ఎంతోమంది యువకులు బలిదానాలు చేసుకున్నారు. ఆ సమయంలో హరీష్ రావు ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేసినట్టు డ్రామా ఆడాడు కానీ.. అగ్గిపెట్టె మాత్రం తెచ్చుకోలేదు. పెట్రోల్ తెచ్చుకున్న వాడు అగ్గిపెట్టె తెచ్చుకోలేదా?" అంటూ జగ్గారెడ్డి తీక్షణమైన ప్రశ్నలు సంధించారు. తమకు నచ్చినట్టు నడుచుకోకపోతే అవతలి వారిని సైకోలు అంటారా అని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఏదో ఒక రకంగా నిందించాలనే ఒకే ఒక్క లైన్ పెట్టుకుని హరీష్‌రావు రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. సమాజంలో హింసకు, రెచ్చగొట్టే స్వభావానికి కేసీఆర్ ఇల్లే కేరాఫ్ అడ్రస్ అని, ఆ లక్షణాలు వారి కుటుంబానికే చెల్లుతాయని ఆరోపించారు.

కాళేశ్వరం పునరుద్ధరణ విషయంలో ఎన్‌డీఎస్ఏ (NDSA) నిపుణుల కమిటీ ఏం చెబితే అది చేయడానికి సీఎం రేవంత్ రెడ్డి సిద్ధంగా ఉన్నారని జగ్గారెడ్డి స్పష్టం చేశారు. నేరుగా ఎన్‌డీఎస్ఏ దగ్గరికే వెళ్లి తేల్చుకుందాం రమ్మంటే హరీష్ రావు నుండి ఎలాంటి స్పందన లేదని నిలదీశారు. ఇదే సమయంలో బీజేపీ ఎంపీ ఈటెల రాజేందర్‌పై కూడా జగ్గారెడ్డి విమర్శలు గుప్పించారు. గతంలో ఈటెల ఆర్థిక శాఖ మంత్రిగా పనిచేశారు కాబట్టే, ఇప్పుడు లోపాయికారీగా బీఆర్ఎస్ నేతలను కాపాడే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. "నువ్వు ఇప్పుడు బీజేపీలో కీలకమైన పదవిలో ఉన్నావు కదా.. కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి కేసీఆర్, హరీష్ రావులను ఢిల్లీకి తీసుకువెళ్లు. మా కాంగ్రెస్ మంత్రులు కూడా వస్తారు. అంతేకానీ అది చేయకుండా ఇక్కడ వృధాగా ఎందుకు మాట్లాడుతున్నావు?" అని ఈటెలకు హితవు పలికారు. రైతులకు మేలు చేసేందుకు కాంగ్రెస్ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని, మాట ఇస్తే నిలబెట్టుకోవడం తమ రాజకీయ సంస్కృతి అని, అది బీఆర్ఎస్, హరీష్ రావుల సంస్కృతి కాదని స్పష్టం చేశారు.

తుంగతుర్తి పంచాయితీపై జగ్గారెడ్డి వ్యాఖ్యలు ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చర్చనీయాంశంగా మారిన తుంగతుర్తి నియోజకవర్గ పంచాయితీపై కూడా జగ్గారెడ్డి స్పందించారు. ప్రస్తుతం తుంగతుర్తి వ్యవహారానికి సంబంధించిన పోస్ట్‌మార్టం (పరిశీలన) జరుగుతోందని, అక్కడ తలెత్తిన సమస్యలను ఎలా సెట్ చేయాలనే అంశాన్ని పరిశీలిస్తున్నామని తెలిపారు. రాజకీయాల్లో కోపతాపాలు సహజమని, నియోజకవర్గానికి చెందిన అందరి అభిప్రాయాలను సేకరిస్తున్నామని చెప్పారు. దీనిపై రేపటికల్లా తుది నివేదిక (రిపోర్ట్) సిద్ధం చేసి పార్టీ అధిష్టానానికి అందజేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీలో అంతర్గత పంచాయితీలు, గొడవలు రావడం చాలా సహజమని, "పంచాయితీలు అంటేనే కాంగ్రెస్" అని ఆయన వ్యాఖ్యానించారు. అన్ని రాజకీయ పార్టీల్లోనూ గొడవలు ఉంటాయని, కాకపోతే తమ పార్టీ వాళ్లు ఏమైనా ఉంటే బహిరంగంగా బయట మాట్లాడతారని, మిగిలిన పార్టీల నేతలు మాత్రం లోపల మాట్లాడుకుంటారని.. కేవలం ఆ ఒక్కటే తమకు, మిగతా వారికి ఉన్న తేడా అని జగ్గారెడ్డి వివరించారు.

## దేవాలయాల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి

- **రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ**
- **ఆలయాల్లో వేల కోట్ల రూపాయల అభివృద్ధి పనులు**
- **బాసర నుంచి భద్రాచలం వరకు టెంపుల్ టూరిజం అభివృద్ధి**
- **వరంగల్ పర్యటనలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి**
- **గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మీసాల ప్రకాశ్ ప్రమాణ స్వీకారానికి హాజరు**
- **ఆధ్యాత్మిక పర్యాటకాన్ని మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యం**
- **దేవాలయాల అభివృద్ధితో స్థానిక ఆర్థిక వ్యవస్థకు ఊతమిస్తామని వెల్లడి**
- **గ్రేటర్ వరంగల్ ఎన్నికలకు కాంగ్రెస్ శ్రేణులు సిద్ధం కావాలని పిలుపు**
- **మేయర్ సీటు గెలుపే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో పనిచేయాలని సూచన**
- **ప్రజలకు చేరువయ్యేలా పార్టీ కార్యకర్తలు పనిచేయాలని ఆకాంక్ష**
- **వరంగల్‌లో కాంగ్రెస్ విజయానికి అందరూ సమన్వయంతో ముందుకు రావాలని పిలుపు**

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**



దేవాలయాల అభివృద్ధిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని రాష్ట్ర మంత్రి కొండా సురేఖ అన్నారు. రాష్ట్రంలోని ప్రధాన ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, ఇప్పటికే ఆలయాల్లో వేలాది కోట్ల రూపాయల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఆధ్యాత్మిక పర్యాటకాన్ని ప్రోత్సహించడం ద్వారా రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి కూడా ఊతమివ్వాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

ఆదివారం వరంగల్ నగరంలో పర్యటించిన మంత్రి కొండా సురేఖ పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా మీసాల ప్రకాశ్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరై శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై వివరించారు. బాసర నుంచి భద్రాచలం వరకు టెంపుల్ టూరిజాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి తెలిపారు. ఆలయాల అభివృద్ధితో పాటు భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఆధ్యాత్మిక క్షేత్రాలను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దే కార్యాచరణ అమలులో ఉందని వెల్లడించారు. ఈ సందర్భంగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలపైనా మంత్రి స్పందించారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఇప్పటి నుంచే ఎన్నికలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. వరంగల్ మేయర్ స్థానాన్ని కాంగ్రెస్ కైవసం చేసుకునేలా క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజల మధ్యకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను విస్తృతంగా వివరించాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు మంత్రి కొండా సురేఖ సూచించారు.

## ఎస్ఐఆర్ లో తప్పులు లేకుండా చూడాలి

- **సర్ ప్రక్రియను వేగవంతం చేయాలి**
- **బాన్సువాడ ఆర్టీవో రవీందర్ రెడ్డి**

**పోతంగల్,జూలై12(ప్రజాక్షేత్రం):**

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలని, ఎటువంటి తప్పులు లేకుండా చూడాలని బాన్సువాడ ఆర్డీఓ రవీందర్ రెడ్డి బిఎల్ఓ లకు సూచించారు. ఆదివారం కోటగిరి,పోతంగల్ మండల కేంద్రాల్లోని గ్రామపంచాయతీ కార్యాలయంలో బిఎల్వోలు చేస్తున్న ఆన్లైన్ ప్రక్రియను బాన్సువాడ ఆర్డీవో రవీందర్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సేవలు అందించాలని చెప్పారు.

సర్పంచ్ కల్లూరి సంధ్యా హన్మండ్లు, కోటగిరి తహసిల్దార్ గంగాధర్, పోతంగల్ తహసీల్దార్ సందీప్, ఎంపీడీవో చందర్, స్థానిక ప్రజా ప్రతినిధులు బిఎల్వోలు పాల్గొన్నారు.



ప్రజాక్షేత్రం
తెలుగు దినపత్రిక
13.07.2026
సోమవారం | హైదరాబాద్

# పోలీస్ స్పోర్ట్స్ మీట్ లో కానిస్టేబుల్ కు బంగారు పతకం

- **కరాటే లో రాష్ట్రస్థాయిలో గోల్డ్ మెడల్ సాధించిన కానిస్టేబుల్ అరుణ్ కుమార్**
- **సన్మానించి అభినందించిన ఎస్సై శ్రీనివాస్**

**కోటగిరి,జూలై 12,(ప్రజాక్షేత్రం):**

కోటగిరి పోలీస్ స్టేషన్ లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న ఎ. అరుణ్ కుమార్ ప్రతిష్ఠాత్మకమైన తెలంగాణ రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో జరిగిన కరాటే పోటీల్లో బంగారు పతకం సాధించారు.ఇటీవల మల్కాజ్‌గిరి కమిషనరేట్ ఆధ్వర్యంలో నిర్వహించబడిన ఈ హైప్రొఫైల్ క్రీడల్లో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ పోటీలలో కానిస్టేబుల్ అరుణ్ కుమార్ అసాధారణమైన మార్షల్ ఆర్ట్స్ నైపుణ్యాలను ప్రదర్శించి అగ్రస్థానంలో నిలిచి బంగారు పథకాన్ని గెలిచారు. కానిస్టేబుల్ అరుణ్ కుమార్ సాధించిన ఈ అద్భుతమైన విజయం కోటగిరి పోలీస్ స్టేషన్‌తో పాటు నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ మొత్తానికి ఎంతో కీర్తి ప్రతిష్ఠలను తీసుకువచ్చిందని కోటగిరిసబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా కోటగిరి పోలీస్ స్టేషన్ ఎస్సై శ్రీనివాస్ అరుణ్ కుమార్ ను శాలువాతో సత్కరించి స్వీట్లు తినిపించారు. ఈ సందర్భంగా ఎస్సై శ్రీనివాస్ మాట్లాడుతూ...కోటగిరి పోలీస్ స్టేషన్‌కు చెందిన సిబ్బంది రాష్ట్ర స్థాయిలో బంగారు పతకాన్ని సాధించడం గర్వకారణంగా భావిస్తున్నామన్నారు. అరుణ్ కుమార్ తన పోలీస్ విధులను నిర్వహిస్తూనే, కరాటే క్రీడలో కఠినమైన శిక్షణను ఎంతో చక్కగా సమతుల్యం చేసుకున్నారని అరుణ్ పట్టుదల కోటగిరి పోలీస్ స్టేషన్‌కు ఎనలేని గౌరవాన్ని తెచ్చిపెట్టిందని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది ఉన్నారు.




# యాలాల మండల ఉపసర్పంచుల సంఘం అధ్యక్షుడిగా ఉప్పరి వెంకటయ్య ఎన్నిక

- **ఉప సర్పంచ్ల హక్కులు, సంక్షేమం, కోసం కృషి చేస్తా**
- **శాలువాలు, పూలమాలలతో నూతన కమిటీకి ఘన స్వాగతం.**

**యాలాల జూలై 12(ప్రజాక్షేత్రం):**

యాలాల మండలం ఉప సర్పంచ్ల సంఘం నూతన కమిటీని ఆదివారం జరిగిన సమావేశంలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అగ్గనూరు గ్రామ ఉపసర్పంచ్ ఉప్పరి వెంకటయ్య ను మండల ఉప సర్పంచ్ల సంఘం అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన ఉప్పరి వెంకటయ్య మాట్లాడుతూ.. నాయకత్వం అనేది ఒక పదవి కాదు.. అది ఒక బాధ్యత నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ మండలంలో ఉపసర్పంచులకు అండగా నిలుస్తాను అని భరోసా ఇచ్చారు. ఉప సర్పంచ్ల హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం సమిష్టిగా కృషి చేస్తాను అని అన్నారు. తనను సంఘం అధ్యక్షుడిగా ఎన్నుకున్న తోటి ఉపసర్పంచ్ లకు అందరికీ ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు ఉప్పరి వెంకటయ్య తో పాటు నూతన కమిటీ సభ్యులను తోటి ఉపసర్పంచులు శాలువాలు, కప్పి పూలమాలలు, వేసి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. నూతన కమిటీలో ఉపాధ్యక్షులుగా శోభారాణి, మోహన్, ప్రధాన కార్యదర్శిగా ప్రవీణ్ కుమార్, కార్యదర్శిగా మాధవి, సలహాదారుగా కుర్వ మహేష్ కుమార్, ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో బెన్నూరు ఉపసర్పంచ్ రఘు, కె. నర్సింలు, మంజుల జగన్నాథం, నరేష్, బుజ్జి, వివిధ గ్రామాల ఉపసర్పంచులు పాల్గొని నూతన కమిటీకి అభినందనలు తెలియజేశారు.



# అమీర్‌పేటలో ఇంద్రమ్మ ఇంటి గృహప్రవేశం.

- **ప్రారంభించిన మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సీహెచ్ యాదయ్య**

**మహేశ్వరం జూలై 12 (ప్రజాక్షేత్రం):**

మహేశ్వరం మండలం అమీర్‌పేట గ్రామంలో చాకలి కుమార్ నూతన ఇంద్రమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సీహెచ్ యాదయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సీహెచ్ యాదయ్య రిబ్బన్ కట్ చేసి గృహప్రవేశాన్ని ప్రారంభించి,నూతన గృహ యజమానులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గల్లా యాదయ్య,వార్డు సభ్యులు మంచినీళ్ల శ్రీనివాస్,డప్పు నరసింహ,ఇంద్రమ్మ కమిటీ సభ్యులు ఎర్ర చంద్రమోహన్,కడల భాస్కర్,ఆవుల రమేష్,తొంట లక్ష్మీ ప్రసాద్, గల్లా అనిల్,సీహెచ్ బాలు,సీహెచ్ వంశీ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా సంక్షేమ పథకాలు విజయవంతంగా అమలవుతున్నాయని,అర్హులందరికీ ఇంద్రమ్మ ఇళ్ల పథకం ప్రయోజనాలు అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని నాయకులు పేర్కొన్నారు.



# తెలంగాణ అగ్రికల్చరల్ సైంటిస్ట్స్ అసోసియేషన్ (టాసా) సర్వసభ్య సమావేశంలో కీలక తీర్మానాలు.

**శంషాబాద్,జూలై12 (ప్రజాక్షేత్రం):**

తెలంగాణ అగ్రికల్చరల్ సైంటిస్ట్స్ అసోసియేషన్ (టాసా) ఆధ్వర్యంలో ఆదివారం రాజేంద్రనగర్ మానస హిల్స్ లో గల నిర్వాణ హోటల్ లో సర్వ సభ్య సమావేశం నిర్వహించారు.టాసా అధ్యక్షులు డాక్టర్ పవన్ చంద్రా రెడ్డి అధ్యక్షతన సమావేశం జరిగింది.ఈ సమావేశంలో సంఘం గత ఏడాది కాలంలో చేపట్టిన కార్యక్రమాలు,ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చేసిన కృషి, ప్రభుత్వం,విశ్వవిద్యాలయ యాజమాన్యంతో నిర్వహించిన చర్చలు,సాధించిన విజయాలను వివరిస్తూ ఒక సంవత్సరం కార్యాచరణ నివేదికను సభ ముందుంచి ఆమోదించారు.సభలో ప్రధానంగా ఎం.ఎస్సీ,పీహెచ్‌డీ ఇంక్రిమెంట్లు, పీఆర్సీ బకాయిలు,కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ (సీ ఏ ఎస్), బదిలీ విధానం,మహిళా ఉద్యోగుల శిశు సంరక్షణ సెలవు (చైల్డ్ కేర్ లీవ్ )కు సంబంధించిన ఆడిట్ అభ్యంతరాలు,2025-26 సంవత్సరానికి సంబంధించిన వార్షిక ఖాతాల ఆమోదం,2026 సంవత్సర సభ్యత్వ నమోదు కార్యక్రమం తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.సభలో చర్చల అనంతరం ఉద్యోగుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని పలు కీలక తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు.పీజీ,పీహెచ్‌డీ అర్హతలు కలిగిన ఉద్యోగులకు మంజూరు చేసిన నాన్‌కాంపౌండ్ అడ్వాన్స్ ఇంక్రిమెంట్లపై వచ్చిన ఆడిట్ అభ్యంతరాల పేరుతో పీఆర్సీ బకాయిలు లేదా జీతాల నుంచి ఎలాంటి రికవరీ చేయరాదని,ఈ అంశంపై ప్రభుత్వం నుంచి తగిన స్పష్టత వచ్చే వరకు ప్రతిపాదిత వసూళ్లను నిలిపివేయాలన్నారు.అవసరమైన ప్రభుత్వ ఉత్తర్వులు,వివరణలు పొందేందుకు విశ్వవిద్యాలయం ఒకటి నుండి రెండు సంవత్సరాల గడువు కల్పించాలని తీర్మానించారు.అదే విధంగా,కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ (సీఏఎస్) కు సంబంధించిన అన్ని దరఖాస్తులను అధ్యాపకులు దరఖాస్తు చేసిన కాలంలో అమలులో ఉన్న సీ ఏ ఎస్ స్కోర్‌కార్డు,సంబంధిత మార్గదర్శకాల ప్రకారమే పరిశీలించి ఆమోదించాలని సభ డిమాండ్ చేసింది.సంఘం సమర్థవంతంగా పని చేయడానికి ఎన్నికైన టాసా పదాధికారులను వారి పదవీకాలంలో విశ్వవిద్యాలయ ప్రధాన కార్యాలయంలోనే నియమించే విధంగా సంఘం ఉపనియమాల్లో తగిన సవరణలు చేయాలని కూడా సాధారణ సభ ఏకగ్రీవంగా తీర్మానించింది.విశ్వవిద్యాలయం విద్యా మండలి ఆమోదించిన బదిలీ విధానాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని,అన్ని బదిలీలను పారదర్శకంగా



చేపట్టాలని,అలాగే బదిలీ చేయబడిన ఉద్యోగులందరికీ బదిలీ ప్రయాణ భత్యం (టీటీఏ) ను ఎటువంటి జాప్యం లేకుండా చెల్లించాలని తీర్మానించారు. పెండింగ్‌లో ఉన్న అన్ని టీటీ ఏ బిల్లులను వెంటనే విడుదల చేయాలని,భవిష్యత్తులో ప్రతి బదిలీకి సంబంధించిన భత్యాలను సకాలంలో చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని విశ్వవిద్యాలయాన్ని కోరారు.మహిళా ఉద్యోగులకు శిశు సంరక్షణ సెలవు (చైల్డ్ కేర్ లీవ్) విషయంలో ఏర్పడిన ఆడిట్ అభ్యంతరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి,ఉద్యోగులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని కూడా సభ నిర్ణయించింది.ఈ సమావేశంలో టాసా అధ్యక్షులు డా.కె. పవన్ చందర్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి డా.సల్లా సౌజన్య,ఉపాధ్యక్షులు డా.జె.కమలాకర్,సంయుక్త కార్యదర్శి డి.రమేష్,కోశాధికారి డా.పి. ప్రశాంత్,కేంద్ర కార్యవర్గ సభ్యులు,కార్యవర్గ ప్రతినిధులు,వివిధ కళాశాలలు,పరిశోధనా కేంద్రాలకు చెందిన శాస్త్రవేత్తలు,అధ్యాపకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా సంఘం నాయకత్వం ఉద్యోగుల హక్కులు,సంక్షేమం, సేవా భద్రత,విశ్వవిద్యాలయ అభివృద్ధి కోసం టాసా నిరంతరం కట్టుబడి పనిచేస్తుందని,సాధారణ సభలో ఆమోదించిన తీర్మానాలను వెంటనే అమలు చేయాలని విశ్వవిద్యాలయ యాజమాన్యాన్ని కోరింది.కార్యవర్గ సభ్యులుగా డాక్టర్ ఎం రమేష్, డాక్టర్ అఫిఫా జహాన్ లను నియమిస్తూ సర్వ సభ్య సమావేశం తీర్మానం చేసింది.

# బహదూర్‌గూడ రైతులకు ప్రభుత్వం వెంటనే న్యాయం చేయాలి

- **సిపిఐ రాష్ట్ర కార్యదర్శి,ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు.**

**శంషాబాద్ జులై12 (ప్రజాక్షేత్రం):**

బహదూర్‌గూడ రైతు భూ పోరాట సమితి ఆధ్వర్యంలో కొనసాగుతున్న నిరవధిక దీక్షా శిబిరాన్ని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి,ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సందర్శించి రైతులకు సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బహదూర్‌గూడలో మొత్తం సుమారు 1,400 ఎకరాల భూమిలో 650 ఎకరాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించడం తీవ్ర అన్యాయమని అన్నారు.ఈ భూముల విషయంలో రైతులు న్యాయపోరాటం చేసి హైకోర్టు నుంచి స్టే ఆర్డర్ తెచ్చుకుని ఇప్పటికే తొమ్మిది నెలలు గడిచినా ప్రభుత్వం స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు. కోర్టు ఆదేశాలను గౌరవించకుండా హైడ్రా వంటి సంస్థలను ఉపయోగించి రైతులను భయభ్రాంతులకు గురిచేయాలని ప్రభుత్వం ప్రయత్నించడం ప్రజాస్వామ్య విరుద్ధమని విమర్శించారు.హైడ్రా ద్వారా ఇప్పటివరకు రాష్ట్రంలో ఎన్ని ఎకరాల భూమిని,ఎవరి నుంచి,ఏ ప్రాతిపదికన స్వాధీనం చేసుకున్నారో ప్రభుత్వం వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రైతులను బెదిరించి భూములు లాక్కోవాలని కాకుండా,వారి సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించాలని సూచించారు.రైతుల భూములకు పట్టాదారు పాస్‌బుక్‌లు ఇవ్వకుండా,భూ హక్కులను నిర్ధారించకుండా,బిల్డోజర్లు,బస్ టెర్మినల్,మెట్రో రైలు,ఇతర ప్రాజెక్టుల పేరుతో సాగుభూములను స్వాధీనం చేసుకోవడం ఏ మాత్రం సమంజసం కాదన్నారు.ప్రభుత్వం రైతులను ఒంటరిగా చేసి బెదిరించే ప్రయత్నాలను తీవ్రంగా ఖండిస్తున్నామని,రైతులంతా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.రాష్ట్రంలో గతంలో లక్షల ఎకరాల భూములను క్రమబద్ధీకరించారని ,జీవో 58,59ల ద్వారా పట్టాలు,రిజిస్ట్రేషన్లు కూడా జరిగాయని గుర్తు చేశారు.ప్రస్తుతం వివాదాస్పదంగా ఉన్న ఈ భూములు ప్రభుత్వ రికార్డుల ప్రకారం ప్రభుత్వ భూములుగా ఎక్కడా నమోదు కాలేదని తెలిపారు.అయినప్పటికీ దశాబ్దాలుగా సాగు చేస్తున్న నిరుపేద రైతుల నుంచి ప్రభుత్వం పన్నులు వసూలు చేసిందని,ఇప్పుడు అదే భూములపై హక్కులను ప్రశ్నించడం అన్యాయమని అన్నారు."పేదవాడి గొంతును వినిపించేది కమ్యూనిస్టులే. పేదల,రైతుల,కార్మికుల పక్షాన ఎర్రజెండా నిరంతరం పోరాటం చేస్తూనే ఉంటుంది. బహదూర్‌గూడ రైతులకు న్యాయం జరిగే వరకు సిపిఐ అండగా నిలుస్తుంది" అని కూనంనేని సాంబశివరావు స్పష్టం చేశారు .ఈ కార్యక్రమంలో సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య,సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు ,రామస్వామి,రైతు సంఘం నాయకులు ప్రభులింగం,సత్యనారాయణ,ఆర్ యాదగిరి. నర్రగిరి,అడ్వకేట్ సతీష్ రెడ్డి,ప్రవీణ్ గౌడ్, గ్రామ రైతులు కృష్ణ మోహన్,రాజు, కేఎం రాజు,నరసింహ తదితరులు పాల్గొన్నారు.





# షాబాద్ ఆరుగురు హత్యల బాధిత కుటుంబానికి సబితా ఇంద్రారెడ్డి పరామర్శ.

- **రూ.5 లక్షల సాయం అందించిన పట్నం అవినాష్ రెడ్డి**
- **బాధిత కుటుంబానికి రూ.1 కోటి పరిహారం ఇవ్వాలని డిమాండ్.**
- **పోక్సో కేసులో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని సబితా ఇంద్రారెడ్డి విజ్ఞప్తి**

**షాబాద్,జూలై 12(ప్రజాక్షేత్రం):**

షాబాద్ మండల కేంద్రంలో చోటుచేసుకున్న ఆరుగురు హత్యల ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపిన నేపథ్యంలో మాజీ మంత్రి పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మాజీ జడ్పీటీసీ పట్నం అవినాష్ రెడ్డి ఆధ్వర్యంలో, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డితో కలిసి ఆమె బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి, ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ, ఇలాంటి దారుణ ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం రూ.1 కోటి పరిహారాన్ని డిపాజిట్ చేయాలని, ఈ ఘటనలో కుటుంబ సభ్యులను కోల్పోయిన వికలాంగురాలైన బాలిక సోదరి మేఘనకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలవాలని డిమాండ్ చేశారు. పోక్సో కేసులో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీసు అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు.

అనంతరం మాజీ జడ్పీటీసీ పట్నం అవినాష్ రెడ్డి తన వ్యక్తిగతంగా బాధిత కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయాన్ని చెక్కు రూపంలో అందజేసి, కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి,బీఆర్ఎస్ నాయకులు రాజేందర్ గౌడ్, నరసింహారెడ్డి,వెంకట్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ టు వీలర్ మెకానిక్ సంఘం ప్రధాన కార్యదర్శిగా బాకం ఆంజనేయులు ఎన్నిక.

- **సుందరగిరి గ్రామస్తుడి ఎన్నికపై పలువురి హర్షం.**

**చిగురుమామిడి జులై 12 (ప్రజాక్షేత్రం):**

కరీంనగర్ నగర పరిధిలోని ఆల్ టూ వీలర్ మెకానిక్స్ వెల్ఫేర్ సొసైటీ ఎన్నికల్లో ప్రధాన కార్యదర్శిగా చిగురుమామిడి మండలం సుందరగిరి గ్రామానికి చెందిన బాకం ఆంజనేయులు ఘన విజయం సాధించారు.సొసైటీ పరిధిలో నిర్వహించిన ఈ ఎన్నికల్లో దాదాపు 400ఓట్లు ఉండగా 327ఓట్లు పోలుకాగా బాకం ఆంజనేయులుకు 159ఓట్లు వచ్చినట్లు తెలిపారు. బాకం ఆంజనేయులు ఎన్నికపై గ్రామస్తులు,స్నేహితులు, సన్నిహితులు,సొసైటీ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.టూ వీలర్ మెకానిక్ సభ్యులకు అండగా ఉంటానని తెలుపుతూ కృతజ్ఞతలు తెలిపారు.



# షాబాద్‌లో ఆరుగురు అమాయకుల హత్య ఘటనపై అలిండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర కమిటీ తీవ్ర ఆవేదన

- **రాజ్ కుమార్ నిందితుడిని అత్యంత కఠినంగా శిక్షించి బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలి.**
- **అలిండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బేగరి రాజు**

**మహేశ్వరం జులై 12 (ప్రజాక్షేత్రం):**



షాబాద్ ప్రాంతంలో ఆరుగురు అమాయకులను దారుణంగా హత్య చేసిన ఘటన సభ్య సమాజాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని అలిండియా అంబేద్కర్ యువజన సంఘం తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు బేగరి రాజు తెలిపారు. ఒకే ఘటనలో ఆరుగురు ప్రాణాలు కోల్పోవడం అత్యంత విషాదకరం ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులకు అలిండియా అంబేద్కర్ యువజన సంఘం ప్రగాఢ సానుభూతి తెలియజేస్తోందన్నారు బాధితుల కుటుంబాలకు ఈ దారుణ ఘటనకు బాధ్యుడైన రాజ్ కుమార్ అనే నిందితుడిపై చట్టప్రకారం వేగవంతమైన దర్యాప్తు జరిపి, నిష్పాక్షికంగా కేసును విచారించి, అత్యంత కఠినమైన శిక్ష విధించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఎలాంటి ప్రభావాలకు లోనుకాకుండా న్యాయం చేయలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తక్షణ ఆర్థిక సహాయం అందించడంతో పాటు, కుటుంబ సభ్యుల్లో అర్హులైన వారికి ఉద్యోగం లేదా జీవనోపాధి కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు . ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా రాష్ట్రంలో శాంతిభద్రతలను మరింత బలోపేతం చేసి ప్రజల్లో భద్రతాభావాన్ని పెంపొందించాలన్నారు . నేరస్తులు ఎంతటి వారైనా చట్టం ముందు అందరూ సమానమే అనే సందేశం సమాజానికి వెళ్లేలా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని వీడియతో తెలియజేశారు.





# అంగన్వాడీ సమస్యలు తక్షణమే పరిష్కరించాలి – కార్మిక సంఘం డిమాండ్

- **12–13 తేదీల్లో భద్రాచలం నుంచి కొత్తగూడెం వరకు పాదయాత్ర**

**బూర్గంపాడు జూలై 12 (ప్రజాక్షేత్రం):**

అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలోని అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ డిమాండ్ల సాధన కోసం జూలై 12, 13 తేదీల్లో భద్రాచలం నుంచి కొత్తగూడెం వరకు నిర్వహించనున్న పాదయాత్రకు మద్దతుగా శనివారం బూర్గంపహాడ్ మండలం మోరంపల్లి బంజర గ్రామంలో రెండు గంటల పాటు ఆటపాటలతో కూడిన ప్రచార కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు ఎన్నో సంవత్సరాలుగా తక్కువ వేతనాలతో, అధిక పనిభారంతో విధులు నిర్వహిస్తున్నప్పటికీ ప్రభుత్వం వారి సమస్యలను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం నిలబెట్టుకుని అంగన్వాడీ సిబ్బందికి రూ.18 వేల వేతనం అమలు చేయాలని, సమగ్ర శిశు అభివృద్ధి సేవల పథకానికి తగిన నిధులు కేటాయించాలని కోరారు.అదేవిధంగా అంగన్వాడీ సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని, ఉన్నత న్యాయస్థానం తీర్పు మేరకు గ్రాట్యుటీ చెల్లించాలని డిమాండ్ చేశారు.ఓటరు జాబితా వంటి అదనపు విధులను అంగన్వాడీ సిబ్బందితో చేయించవద్దని, ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నింటినీ వారికి వర్తింపజేయాలని కోరారు.ప్రీప్రైమరీ పిల్లలను బలవంతంగా ఇతర పాఠశాలలకు పంపే విధానాన్ని నిలిపివేయాలని, ప్రైవేటు పాఠశాలల్లో చేరికలను ప్రోత్సహించవద్దని, 60 నెలలు పూర్తి చేసిన పిల్లలకు అంగన్వాడీ ధ్రువీకరణ పత్రాలు అందించాలని విజ్ఞప్తి చేశారు.అలాగే ప్రతి అంగన్వాడీ కేంద్రానికి పక్కా భవనం, తాగునీరు, మరుగుదొడ్లు, వంట గ్యాస్ వంటి మౌలిక సదుపాయాలు కల్పించి, భవనాల అద్దెలను సకాలంలో చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు.

# భూముల సర్వే వేగవంతం చేయాలి కలెక్టర్ చిత్రా మిశ్రా

**కరీంనగర్, జూలై 10(ప్రజాక్షేత్రం):**


జిల్లాలో భూముల సర్వే, రీసర్వే ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. సాదా బైనామా-భూభారతి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ప్రతి అంశంలో అధికారులు పక్కా ప్రణాళికతో పనిచేసి ప్రజలకు వేగవంతమైన సేవలు అందించాలని పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి కలెక్టరేట్ క్యాంపు కార్యాలయంలో ఆర్డీవోలు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో భూముల సర్వే, రీసర్వే, భూభారతి-సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారం, ప్రత్యేక ఓటరు సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం పురోగతిపై సమీక్షించారు. తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి గ్రామంలో చేపట్టిన రీసర్వే పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో 70 గ్రామాల్లో భూముల సర్వే చేపట్టనున్నట్లు, ఇప్పటికే ఏడు గ్రామాల్లో పనులు ప్రారంభమైనట్లు తెలిపారు. మిగిలిన గ్రామాల్లోనూ ప్రత్యేక బృందాలతో యుద్ధ ప్రాతిపదికన సర్వే పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలో సుమారు 94,637 ఎకరాల్లో సర్వే నిర్వహించనున్న నేపథ్యంలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. ప్రత్యేక ఓటరు సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయాలని, బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లి ప్రతి ఓటరికి ఎన్యుమరేషన్ ఫారాలు అందజేయాలని ఆదేశించారు. ప్రతి పది మంది బీఎల్‌వోలకు ఒక క్లస్టర్ ఏర్పాటు చేసి పకడ్బందీగా కార్యక్రమం అమలు చేయాలని సూచించారు. రెవెన్యూ సదస్సుల నిర్వహణపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. అనంతరం గృహ నిర్మాణ శాఖ అధికారులతో సమావేశమై ఇందిరమ్మ ఇళ్లు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించారు. నిర్మాణ పనులను వేగవంతం చేసి లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో కరీంనగర్, హుజూరాబాద్ ఆర్డీవోలు షర్మిల, జలకుమారి, గృహ నిర్మాణ శాఖ అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు మోబిన్, కాళీచరణ్, మాధవి తదితర అధికారులు పాల్గొన్నారు.



# కుటుంబంతో కలిసి ఎన్యూమరేష్ ఫామ్స్ నింపి ఇచ్చిన లక్ష్మారెడ్డి

- **దొంగ ఓట్లను తొలగిద్దాం మన ఓట్లను కాపాడుకుందాం కేఎల్ఆర్**

**మహేశ్వరం జులై 12 (ప్రజాక్షేత్రం):**



ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) పూర్తి చేసేందుకు బి ఎల్ ఓ లు, అధికారులు ఆదివారం కూడా పని చేస్తున్నారని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి కొనియాడారు. ఈ అవకాశాన్ని ప్రభుత్వ ఉద్యోగులు, ప్రైవేటు ఉపాధి, ఉద్యోగాలు చేసేవారు ఆదివారం సెలవు దినం రోజున వినియోగించుకోవాలని కేఎల్ఆర్ కోరారు.ఈనెల 24తో సర్ గడువు ముగుస్తున్నందున్న ఎన్యూమరేషన్ ఫారమ్స్ ను పూర్తి చేసే బి ఎల్ ఓ కు అందజేయాలని కోరారు.

కాంగ్రెస్ పార్టీ తరపున ఉన్న బి ఎల్ ఎ లు సైతం అక్రమ ఓట్లను తొలగించేలా అధికార యంత్రాంగానికి, బి ఎల్ ఓ లకు సహకరించాలని కిచ్చెన్న సూచించారు.

ఎన్యూమరేషన్ ఫారమ్స్ అందని వారు సమీపంలోని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రధాన కూడళ్ల వద్ద ఓటర్ సమగ్ర సవరణ ఫారమ్స్ అందిస్తున్నారని లక్ష్మారెడ్డి తెలిపారు.

**సర్ లో పాల్గొనండి- ఓటును కాపాడుకోండి: కేఎల్ఆర్**

ఎన్యూమరేషన్ ఫారమ్స్ లో తప్పులు లేకుండా నింపి బి ఎల్ ఓలకు ఇవ్వాలని కోరారు. నిర్లక్ష్యం చేసినా ఓటు గల్లంతు అయ్యే ప్రమాదం ఉందన్నారు. లేదా ఆన్ లైన్ ద్వారా మీఓటును అప్ డేట్ చేసుకోవాలని సూచించారు. దొంగఓట్లను ఏరిపారే ప్రక్రియ సర్ ద్వారా కొనసాగుతుందని... అందువల్ల నిజమైన ఓటర్లు తమ ఓటును కాపాడుకోవాలని కెఎల్ఆర్ కోరారు. చివరి వరకు ఆగకుండా వీలైనంత త్వరగా ఎస్ఐఆర్ లో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

# కొత్తపల్లిలో స్టార్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

**కోటగిరి,జులై12(ప్రజాక్షేత్రం):**

మండలంలోని కొత్తపల్లి గ్రామంలో స్టార్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు. గ్రామ సర్పంచ్ పుప్పల చిన్న గంగారాం ముఖ్య అతిథిగా పాల్గొని ఈ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. గ్రామంలోని ప్రజలకు స్టార్ హాస్పిటల్ వైద్య సిబ్బంది పలు రకాల పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గంగారాం మాట్లాడుతూ... పేద ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నిత్యం పనులతో బిజీగా ఉండే గ్రామీణ ప్రజలకు ఉచిత వైద్య శిబిరాలు ఎంతగానో ఉపయోగపడతాయని ఆయన అన్నారు. తమ గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసిన స్టార్ హాస్పిటల్ యాజమాన్యానికి వైద్య సిబ్బందికి ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పుప్పల చిన్న గంగారాం,గ్రామ సెక్రెటరీ జగదీష్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.




# స్థానిక యువతకు సినీ రంగంలో ప్రాధాన్యతకు కృషి

- **నేనింతే సినిమా షూటింగ్ ప్రారంభోత్సవంలో సినీ నిర్మాత బోడ భాస్కర్**

**జహిరాబాద్ జూలై 12 ( ప్రజాక్షేత్రం):**

మారుతున్నా కాలానికి అనుగుణంగా సినిమాల్లో కూడా ఆధునిక హంగులను జోడించి నూతన సినిమాను నిర్మించేందుకు సినీ నిర్మాతలు ప్రాధాన్యత ఇవ్వాలని, స్థానిక యువతకు సినిమాల్లో కీలకమైన స్థానాల్లో అవకాశం కల్పించేందుకు తమ టీం ఎప్పటికప్పుడు ప్రయత్నాలు సాగిస్తుందని సినీ నిర్మాత బోడ భాస్కర్ అన్నారు. శనివారం నాడు హైదరాబాద్ మహానగరంలో నేనింతే తెలుగు సినిమా దర్శకుడు ఆహ్వానం మేరకు నిర్మాత భాస్కర్ హాజరై టెంకాయకొట్టి సినిమా షూటింగ్ పనులను ప్రారంభించారు. నిర్మాత భాస్కర్ కు చిత్ర నిర్మాణం యూనిట్ సభ్యులు బొకే ఇచ్చి శాలువాకప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మారుతున్న యువత అభిరుచులకు అనుగుణంగా సినిమాలను తియ్యడానికి ప్రయత్నించాలని, హాస్యం, సందేశంత్మక కథ, మంచి మ్యూజిక్ అందించాలనీ సూచించారు. సినిమాలు స్థానిక యాసను, స్థానిక ప్రాంతాల్లో ఉన్న మంచి లొకేషన్లను గుర్తించి సినిమాలను నిర్మించాలని కోరారు. త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా ఆరాధ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంచి నైపుణ్యం గల యువతను గుర్తించి తమ సంస్థ నిర్మాణంలో వారికీ సినిమాల్లో అవకాశం ఇవ్వడానికి శయశక్తులు కృషిచేస్తామని అన్నారు.



# ప్రధాన రహదారి అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**వలిగొండ జూలై 12(ప్రజాక్షేత్రం):**

యాదాద్రి భువనగిరి జిల్లా రూ.274.79 కోట్ల రహదారి అభివృద్ధి పనులకు శంకుస్థాపన రామన్నపేటలో రూ.274.79 కోట్లతో చేపట్టనున్న మూడు ప్రధాన రహదారి అభివృద్ధి పనులకు రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ప్రభుత్వ విప్ వేముల వీరేశం పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో భువనగిరి నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఎన్నికల హామీలను అమలు చేస్తూ రహదారులు, సాగునీరు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందన్నారు ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు, కార్యకర్తలు మరియు భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.





# మల్కాపూర్ లో 409 వ స్వచ్ఛభరత్.... సర్పంచ్

**తూప్రాన్ జులై 12 ప్రజా క్షేత్రం**

మెదక్ జిల్లా తూప్రాన్ మండలం మల్కాపూర్ లో 409 వ స్వచ్ఛభరత్ నిర్వహించిన సర్పంచ్ ఆంజనేయులు గౌడ్ స్వచ్ఛ గ్రామమే లక్ష్యంగా ప్రతి ఆదివారం గ్రామంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్లు ఆదర్శ గ్రామ సర్పంచ్ ఆంజనేయులు గౌడ్ పేర్కొన్నారు. గ్రామంలోని 7,8 వార్డులలో వారాంతపు కార్యక్రమంలో భాగంగా రెండు గంటల పాటు శ్రమదానం చేశారు. పిచ్చి మొక్కలు, ప్లాస్టిక్ ను తొలగించి సీసీ రోడ్లను చీపుర్లతో ఊడ్చి శుభ్రపరిచారు. తడి పొడి చెత్తపై మహిళలకు ఈ సందర్భంగా అవగాహన కల్పించారు.409 వారాలుగా స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని గ్రామంలో నిర్విరామంగా కొనసాగిస్తున్నట్లు సర్పంచ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ స్వామి, వార్డు సభ్యులు, మేకిన్ యువత, మహిళలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# గూడూరు పరిసర ప్రాంతాల్లో చిరుత సంచారం

- **అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ హెచ్చరిక**

**గూడూరు జులై 12(ప్రజాక్షేత్రం):**

మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల పరిధిలోని ఓ వ్యవసాయ క్షేత్రంలో గుర్తించిన పాదముద్రలు ప్రాథమికంగా చిరుతపులివేనని అటవీశాఖ అధికారులు వెల్లడించారు. ఈ విషయాన్ని ఫారెస్ట్ రేంజ్ అధికారి (ఎఫ్ ర్ ఒ) ప్రసాద్ రావు తెలిపారు.

రైతులు అందించిన సమాచారం... మేరకు మండల కేంద్ర సమీపంలోని కోడి చెరువు ప్రాంతంలో శనివారం సాయంత్రం సాయంత్రం 7 గం. ప్రాంతంలో ఓ రైతు తన వ్యవసాయ క్షేత్రం వైపు వెళ్లాడు. ఈ క్రమంలో పక్కనే ఏపుగా పెరిగిన జీలుగా మొక్కలలో ఏదో శబ్దం చేస్తూ జంతువు కదిలినట్లు గమనించాడు. భయపడిన రైతు ఆదివారం ఉదయం మరికొందరు రైతులతో కలిసి ఆ ప్రాంతానికి వెళ్లగా ఓ జంతువు పాదముద్రలు చూసి మాకు (ఫారెస్ట్ అధికారులు) తెలియజేయడంతో అటవీశాఖ అధికారులు ఘటన స్థలాన్ని పరిశీలించి పాదముద్రలను పరిశీలించారు. అవి చిరుతపులికి చెందినవేనని ప్రాథమికంగా నిర్ధారించినట్లు అధికారులు తెలిపారు.

సమీప గ్రామాల ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని, ఒంటరిగా పొలాలకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చిరుత కనిపించినా, అనుమానాస్పద కదలికలు గమనించినా వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరారు.

అటవీశాఖ సిబ్బంది పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు అధికారులు వెల్లడించారు.







# శివాలయానికి స్లాబ్ నిర్మాణం.. కాలనీవాసుల కృతజ్ఞతాభివందనం

- **దాతల సహకారంతో శివాలయానికి స్లాబ్.. ముప్పు శ్రీనివాస్‌రెడ్డికి ఘన సన్మానం**

**నాగారం, జూలై 12(ప్రజా క్షేత్రం):**

ఘట్కేసర్ సర్కిల్ పరిధిలోని నాగారం డివిజన్‌లోని న్యూ హనుమాన్‌నగర్ కాలనీలో ఉన్న శివాలయానికి దాతల సహకారంతో స్లాబ్ నిర్మాణం చేపట్టించిన మాజీ కాంగ్రెస్ పార్టీ నాగారం డివిజన్ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్‌రెడ్డికి కాలనీవాసులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ అభివృద్ధికి ఆయన అందించిన సేవలను కొనియాడుతూ కాలనీకి ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ, శివాలయానికి స్లాబ్ నిర్మాణం పూర్తికావడంతో భక్తులకు ఎండ, వర్షాల నుంచి ఉపశమనం లభించిందని తెలిపారు. దాతలను సమీకరించి నిర్మాణ పనులు పూర్తి చేయడంలో ముప్పు శ్రీనివాస్‌రెడ్డి కీలక పాత్ర పోషించారని ప్రశంసించారు. భవిష్యత్తులో కూడా కాలనీ అభివృద్ధి, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ఇదే విధంగా అండగా నిలవాలని కోరారు. ముప్పు శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ, దాతల సహకారంతో ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేయడం సంతోషంగా ఉందన్నారు. ప్రజలకు ఉపయోగపడే సామాజిక, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో ఎల్లప్పుడూ భాగస్వామిగా ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ పెద్దలు, యువకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



## సైకో రాజు కుమార్ ను నాడి రోడ్డుపై ఉరి తీయాలి

- **రంగా రెడ్డి జిల్లా సర్పంచుల పొరం నాయకుల డిమాండ్.**
- **రాష్ట్ర ఉప సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు బొట్ల కార్తిక్..**

**శంషాబాద్ జూలై12(ప్రజాక్షేత్రం):**

దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన సైకో రాజు కుమార్ నరమొదం అందరిని దిగ్బ్రాంతికి గురి అయిన దానికి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ఉరి తీయాలని రాష్ట్ర ఉప సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు బొట్ల కార్తీక్ అన్నారు. ఆదివారం శంషాబాద్ పట్టణంలో జిల్లా ఉప సర్పంచ్ ల పోరం అధ్వర్యంలో మొన షాబాద్ లో సైకో రాజు కుమార్ అరుమందిని నరమేధం చేసిన కాసహికి వేతిరేకంగ నాడి రోడ్డుపై ఉరితియ్యాలని శంషాబాద్ పట్టణంలో భారీ ఎత్తున కోవ్వుతుల ర్యాలీ నిర్వహించి చనిపోయిన వారి ఆత్మకు శాంతి చేరాలని మౌనం పాటించారు. అనంతరం వారు మాట్లాడుతూ... సైకో రాజును ప్రభుత్వం వెంటనే స్పందించి కిరాతకుని నడిరోడ్డుపై ఉరితీయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉప సర్పంచ్ ఫోరం అధ్యక్షులు బొట్ల కార్తిక్, రాష్ట్ర జనరల్ సెక్రెటరీ శ్రీనివాస్, జిల్లా అధ్యక్షులు భాస్కర్, గౌరవ అధ్యక్షులు రాళ్ల బండి శివకుమార్ గౌడ్, రోహిత్ కుమార్, నరేష్, గోవర్ధన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## కార్యకర్తల సమస్యలు పరిష్కరించేందుకు నూతన అధ్యక్షులు కృషి చెయ్యాలి

- **పార్టీ శ్రేణులకు నిత్యం అందుబాటులో ఉండేందుకు కార్యాలయం**
- **మండల కాంగ్రెస్ కార్యాలయన్ని ప్రారంభించిన ఆత్మ చైర్మన్ రామలింగారెడ్డి**

**జహిరాబాద్ జూలై 12 (ప్రజాక్షేత్రం):**

ఇటీవల పార్టీని సంస్థగతంగా బలోపేతం చేసేందుకు రాష్ట్రంలో మండలాల పార్టీ అధ్యక్షుల నియామకం చేపట్టిన సంగతి తెలిసిందే. అందులో భాగంగానే కోహిర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా సువర్ణ మల్లన్న పాటిల్ ను నియామితులయ్యారు. ఆదివారం కోహిర్ మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయన్ని ఆత్మ కమిటీ చైర్మన్ రామలింగారెడ్డి, మల్లన్న పాటిల్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదిష్టనం నిర్ణయం మేరకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు సమన్వయంతో కలిసి మెలసి పార్టీ పటిష్టత కొసం పని చేయాలని కొరారు. ఈ కార్యక్రమంలో కోహిర్ మున్సిపల్ చైర్మన్ అశోక్, వైస్ చైర్మన్ హన్నన్ జావీద్, కోహిర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మీర్ ముజఫ్ఫర్ హుసేన్, మాజీ జడ్పీటీసీ రాందాస్, సర్పంచ్ లు విద్యాసాగర్, విష్ణు, అశోక్, సయ్యద్ అహ్మద్, లియాఖత్, రాజుకుమార్, అనిల్, వీరారెడ్డి, అమృతప్ప, కౌన్సిలర్ శిరీష, కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీధర్ రెడ్డి, శంషిర్ అలీ, జీవరత్నం, జగదీశ్ రెడ్డి, కవెల్లి క్రిష్ణ, షౌకత్ అలి, మాణికప్ప, మల్లికార్జున్ పాటిల్, బాపూజీ, మధుసూదన్ రెడ్డి, మామిడ్గి నర్సింలు, ఎక్బాల్, మునిర్ పాటెల్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు, మాజీ సర్పంచ్ లు, మాజీ ఎంటిసిలు తదితరులు పాల్గొన్నారు.



## ఏఐటియుసి మహాసభలకు తరలి వెళ్ళిన నాయకులు

**కోటగిరి,జులై 12(ప్రజాక్షేత్రం):**

నిజామాబాద్ జిల్లా కేంద్రంలో జరిగిన ఏఐటియుసి 22వ మహాసభలకు కోటగిరి, పొతంగల్ మండలాల నుండి ఏఐటియుసి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. సిపిఐ కోటగిరి మండల కార్యదర్శి విటల్ గౌడ్ ఏఐటీయూసీ జెండాను ఊపిన అనంతరం మహాసభలకు బయలుదేరారు.ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దుబాస్ రాములు, సిపిఐ కోటగిరి మండల కార్యదర్శి విటల్ గౌడ్ మాట్లాడుతూ... కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను రద్దుచేసి 4 కోడ్ లుగా విభజించి అమలు చేయడం విచారకరమని దీని వలన కార్మికులు నష్టపోయే ప్రమాదం ఉందని అన్నారు. ఈ కోట్ల వల్ల కార్మికులు నష్టపోయే అవకాశం ఉందని కేంద్ర ప్రభుత్వం వెంటనే లేబర్ కోడ్లను రద్దుచేసి పాత పద్ధతిలో చట్టాలను అమలు చేయాలని కోరారు. కార్మికులకు న్యాయం జరిగేంతవరకు ఏఐటియుసి పోరాడుతుందని చెప్పారు. మహాసభలకు తరలి వెళ్ళిన వారిలో నల్ల గంగాధర్, కొట్టే ప్రసాద్, రాజు, నీలి శంకర్, శివ రాజులు, హనుమాన్లు, పోశెట్టి, సాయిలు,రాజు తదితరులు పాల్గొన్నారు.



# "సర్" గడువు సమీపిస్తున్నా.. ఓటర్ల చేతికి చేరని ఫారాలు

- **ఒకవైపు గడువు ముగింపు హెచ్చరికలు.. మరోవైపు ఇంటింటికీ అందని దరఖాస్తులు**
- **వేలాది మంది ఓటర్లలో అయోమయం.. 'ఫారం లేకపోతే ఓటు హక్కు ఏమవుతుంది?' అంటూ ఆందోళన**
- **పూర్తిస్థాయిలో పంపిణీ జరిగిందా?.. బాధ్యత ఎవరిది? అని ప్రశ్నిస్తున్న ప్రజలు**

**హైద్రాబాద్, (ప్రజా క్షేత్రం)**

ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియకు ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువు వేగంగా సమీపిస్తున్నా, క్షేత్రస్థాయిలో మాత్రం ఫారాల పంపిణీ పూర్తిస్థాయిలో జరగలేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నికల సంఘం ఒకవైపు గడువు ముగింపు దగ్గరపడుతోందని ప్రకటిస్తూ ఓటర్లను అప్రమత్తం చేస్తుండగా, మరోవైపు అనేక ప్రాంతాల్లో ఇప్పటికీ వేలాది మంది ఓటర్లకు ఎస్ఐఆర్ ఫారాలు అందకపోవడం తీవ్ర ఆందోళనకు కారణమవుతోంది.

ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ప్రతి అర్హ ఓటరికి సంబంధిత ఫారాలు ఇంటింటికీ వెళ్లి అందజేయాల్సి ఉన్నప్పటికీ, అనేక కాలనీలు, గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో తమకు ఎలాంటి ఫారం అందలేదని ఓటర్లు చెబుతున్నారు. కొందరికి ఒకే కుటుంబంలో కొంతమందికి ఫారాలు అందగా, మరికొందరికి అందలేదని పేర్కొంటున్నారు. దీంతో అసలు పంపిణీ ఏ ప్రాతిపదికన జరుగుతోందో అర్థం కావడం లేదని అంటున్నారు.

ఫారాలు అందని వారు వాటిని ఎక్కడ పొందాలి? ఏ కార్యాలయాన్ని సంప్రదించాలి? ఎలా నింపాలి? ఏ పత్రాలను జతచేయాలి? ఎక్కడ సమర్పించాలి? వంటి అంశాలపై కూడా స్పష్టమైన అవగాహన లేక తీవ్ర అయోమయంలో ఉన్నారు. ఎన్నికల సిబ్బందిని సంప్రదించినా స్పష్టమైన సమాధానాలు లభించడం లేదని పలువురు వాపోతున్నారు.

ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగులు, రోజువారీ కూలీలు, ఉద్యోగులు, నగరాల్లో అద్దె ఇళ్లలో నివసించే వారు, విద్యార్థులు ఈ పరిస్థితులతో ఎక్కువగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలుస్తోంది. ఫారాలు అందకపోవడంతో పలువురు స్వయంగా బీఎల్‌వోలు, పోలింగ్ కేంద్రాలు, ఎన్నికల కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా, అందరికీ సమయానికి ఫారాలు అందడం లేదని చెబుతున్నారు.

ఈ పరిస్థితుల్లో గడువు ముగిసేలోపు ఫారం సమర్పించలేకపోతే తమ పేరు ఓటర్ల జాబితాలో కొనసాగుతుందా? తొలగిస్తారా? భవిష్యత్తులో ఓటు హక్కు వినియోగించుకునే అవకాశంపై ప్రభావం ఉంటుందా? అనే సందేహాలు ప్రజల్లో పెరుగుతున్నాయి. ఈ అంశంపై ఎన్నికల సంఘం నుంచి స్పష్టమైన ప్రకటన రావాలని ఓటర్లు కోరుతున్నారు.

ఇదిలా ఉండగా, 'ప్రతి ఓటరికి ఎస్ఐఆర్ ఫారం అందిందని ఎవరు నిర్ధారిస్తారు? ఫారాలు అందని వారికి బాధ్యత ఎవరిది? పంపిణీ ప్రక్రియను అధికారులు ఎలా పర్యవేక్షిస్తున్నారు?' అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఫారాలు అందలేదని చెప్పిన ఓటర్ల వివరాలను సేకరించి, వారికి వెంటనే అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైన రాజ్యాంగబద్ధ హక్కు కావడంతో, ఎలాంటి అర్హ ఓటరు ఈ ప్రక్రియలో నష్టపోకుండా ఎన్నికల సంఘం ప్రత్యేక చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఇంటింటికీ ఫారాల పంపిణీ పూర్తిస్థాయిలో జరిగేలా పర్యవేక్షణ పెంచడంతో పాటు, అవసరమైతే అదనపు సిబ్బందిని నియమించి ప్రతి ఓటరికి ఫారం అందేలా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

అదే సమయంలో ఎస్ఐఆర్ ప్రక్రియపై విస్తృత ప్రచారం నిర్వహించి, ఫారాల పంపిణీ, దరఖాస్తుల నింపడం, అవసరమైన పత్రాలు, సమర్పణ కేంద్రాలు, గడువు తదితర అంశాలపై స్పష్టమైన మార్గదర్శకాలను ప్రజలకు అందించాలని కోరుతున్నారు. గడువు ముగియడానికి ముందు ప్రతి అర్హ ఓటరికి అవకాశం కల్పించడమే ప్రజాస్వామ్య పరిరక్షణకు అవసరమని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## దైవాలగూడా ఆరు హత్యల కేసు పోలీసుల వైఫల్యమే!

- **48 గంటలైనా లభించని హంతకుడి ఆచూకీ.**
- **హోంశాఖ నిర్లక్ష్యంపై చేవెళ్ల న్యాయవాదుల ఆగ్రహం**
- **నిందితుడిని కఠినంగా శిక్షించాలి**
- **బాధ్యులైన అధికారులను సర్వీస్ నుండి తొలగించాలని డిమాండ్**

**షాబాద్/మొయినాబాద్,జులై 12(ప్రజాక్షేత్రం):**



షాబాద్ పోలీస్ స్టేషన్ కు కూతవేటు దూరంలో ఉన్న దైవాలగూడా గ్రామంలో ఆరుగురు అమాయకులు దారుణ హత్యకు గురైన ఉదంతం రాష్ట్రవ్యాప్తంగానే కాకుండా దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం సృష్టించింది. ఇంతటి ఘోరం జరిగి 48 గంటలు గడుస్తున్నా, హంతకునికి సంబంధించిన ఎలాంటి సమాచారాన్ని గానీ, కేసులో పురోగతిని గానీ సాధించకపోవడం పోలీసు వ్యవస్థ యొక్క వైఫల్యానికి, రాష్ట్ర ప్రభుత్వ అసమర్థతకు అద్దం పడుతోందని చేవెళ్ల బార్ అసోసియేషన్ న్యాయవాదులు తీవ్రంగా మండిపడ్డారు.

కొందరు పోలీసు అధికారుల నిర్లక్ష్య వైఖరే ఈ ఆరుగురు అమాయకుల ప్రాణాలు పోవడానికి ప్రధాన కారణమని వారు ఆరోపించారు. దేశ వ్యాప్తంగా సంచలనంగా మారిన ఈ కేసులో నిందితుడి ఆచూకీని ఇప్పటివరకు కనుగొనలేకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోందని, ఇది పౌరుల, ముఖ్యంగా మహిళలు, పిల్లల భద్రత విషయంలో వ్యవస్థకు ఒక మాయని మచ్చగా నిలుస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంతటి ఘోర కలి కలిగినా రాష్ట్ర హోంశాఖ ఇప్పటివరకు స్పందించకపోవడం సిగ్గుచేటని న్యాయవాదులు ధ్వజమెత్తారు. ఇప్పటికైనా ప్రభుత్వం, హోంశాఖ తక్షణమే స్పందించి నిందితుడిని పట్టుకుని ఎన్‌కౌంటర్ చేయాలని డిమాండ్ చేశారు. ఇలాంటి హేయమైన సంఘటనలు రాష్ట్రంలో పునరావృతం కాకుండా శాంతిభద్రతలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై, పోలీసులపై ఎంతైనా ఉందన్నారు. అలాగే, ఈ ఘటనలో హంతకునికి సహకరించిన పోలీసు అధికారులను కేవలం సస్పెండ్ చేయడం సరికాదని, వారిని వెంటనే సర్వీస్ నుంచి పూర్తిగా తొలగించి, పోలీసు వ్యవస్థపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని కాపాడాలని చేవెళ్ల బార్ అసోసియేషన్ న్యాయవాదులు యం. శివరాజ్ గౌడ్, యం.ప్రసాద్ గౌడ్, జి.శివకుమార్, బి.ఆనంద్ గౌడ్,కే. సుదర్శన్ యాదవ్, బి. ప్రసాద్, సిహెచ్. రవీందర్, నారాయణ యాదవ్ తదితరులు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.

## అమ్డాపూర్‌లో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పిస్తాం

- **సర్పంచ్ మధ్యపాగ కృష్ణ**
- **అధికారులు, వార్డు సభ్యులతో కలిసి ఓటర్ల జాబితా నమోదు ప్రక్రియ ముమ్మరం**
- **సెలవు రోజైనా ప్రజల వద్దకే వెళ్లి వివరాల సేకరణ**

**మొయినాబాద్,జులై 12(ప్రజాక్షేత్రం):**

"అమ్డాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే మా లక్ష్యం. గ్రామంలో పక్కాగా ఓటర్ల జాబితాను రూపొందించేందుకు వార్డు సభ్యులు, అధికారులు కలిసికట్టుగా శ్రమిస్తున్నారు" అని అమ్డాపూర్ గ్రామ సర్పంచ్ మధ్యపాగ కృష్ణ పేర్కొన్నారు. మొయినాబాద్ మండలం అమ్డాపూర్ గ్రామ పంచాయతీలో ఆదివారం నాడు ఓటర్ల జాబితా నమోదు,సవరణ కార్యక్రమాన్ని ఆయన దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మధ్యపాగ కృష్ణ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైందని, యువతీ యువకులు, కొత్తగా గ్రామానికి వచ్చిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సెలవు రోజైనప్పటికీ ప్రజలకు ఇబ్బంది కలగకుండా, అధికారులను సమన్వయం చేసుకుంటూ నేరుగా ప్రజల వద్దకే వెళ్లి ఓటర్ లిస్ట్ ప్రక్రియను పూర్తి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జితేందర్ రెడ్డి, స్థానిక వార్డు సభ్యులు (వాట్సప్‌లు) అధికారులు తదితరులు పాల్గొన్నారు.





## ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యం

- **బొంగునూరి కిషోర్ రెడ్డి**
- **ప్రతి ఇంటికీ స్వచ్ఛజలం.. బికేఆర్ ఫౌండేషన్ ప్రజాహిత కార్యక్రమం**
- **బికేఆర్ ఫౌండేషన్ సామాజిక బాధ్యతకు మరో అడుగు**

**కుత్బుల్లాపూర్,జూలై 12 (ప్రజాక్షేత్రం):**

సామాజిక సేవలో భాగంగా ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో బికేఆర్ ఫౌండేషన్ దుండిగల్ 2బీహెచ్ కే డబుల్ బెడ్‌రూమ్ సముదాయంలో ఏర్పాటు చేసిన ఆధునిక వాటర్ ప్లాంట్ ఆదివారం ప్రారంభమైంది. స్థానిక ప్రజల తాగునీటి అవసరాలను తీర్చే ఈ కార్యక్రమం సామాజిక బాధ్యతకు నిదర్శనంగా నిలిచిందని పలువురు అభిప్రాయపడ్డారు.

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రోటోకాల్ & కోఆర్డినేషన్ కమిటీ వైస్ చైర్మన్ బొంగునూరి కిషోర్ రెడ్డి, దుండిగల్ మాజీ సర్పంచ్ కావలి గణేష్ ముఖ్య అతిథులుగా హాజరై వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు.

ఈ సందర్భంగా బొంగునూరి కిషోర్ రెడ్డి మాట్లాడుతూ, "ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడం ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తొలి మెట్టు. సేవాభావంతో చేపట్టే ఇటువంటి కార్యక్రమాలు సమాజానికి ఎంతో మేలు చేస్తాయి" అని పేర్కొన్నారు. ప్రజల ప్రాథమిక అవసరాలైన తాగునీరు, ఆరోగ్యం, పారిశుధ్యంపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు శ్రీశైలం యాదవ్, దొంతి మహేష్ ముదిరాజ్, శ్రీధర్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, మహిళలు, యువకులు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## వలిగొండ గ్రామ పంచాయతీకి ఎలక్ట్రిక్ పారిశుద్ధ్య వాహనాన్ని అందజేసిన కుంభం

**వలిగొండ జూలై 12(ప్రజాక్షేత్రం):**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు కుంభం ఫౌండేషన్ ఆధ్వర్యంలో వలిగొండ గ్రామ పంచాయతీకి ఎలక్ట్రిక్ పారిశుద్ధ్య వాహనాన్ని . అందజేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీ కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, ఎలక్ట్రిక్ వాహనం వినియోగం వల్ల గ్రామ పంచాయతీపై ఇంధన, నిర్వహణ వ్యయ భారం తగ్గడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా తోడ్పాటు అందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వలిగొండ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు





## స్నేహితుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత.

**యాలాల జూలై 12(ప్రజాక్షేత్రం):**

యాలాల మండలంలోని రాస్నం గ్రామంలో ఆదివారం స్నేహితుడి కుటుంబానికి తోటి మిత్రులు ఆర్థిక సాయం చేసి అండగా నిలిచారు. గ్రామానికి చెందిన కుమ్మరపల్లి లాలప్ప, అంజమ్మ, కూతురు పూజ ఇటీవల గుండెపోటు వచ్చి చనిపోయింది. కాగా 20042005 లో పగిడ్యాల ఉన్నత పాఠశాలలో కలిసి చదువుకున్నారు. విషయం తెలుసుకున్న పూర్వ స్నేహితులు గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.రూ.35100 ఆర్థిక సాయం బాధిత కుటుంబ సభ్యులకు అందజేసి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు స్నేహితులు ఉన్నారు.

## 17వ రోజుకు చేరిన హిమాయత్ నగర్ భూపోరాటం

- **బాధితులకు బీఆర్ఎస్ శ్రేణుల మద్దతు**
- **పట్టాలిచ్చింది మేమే.. ఇళ్లు కట్టించేదీ మేమే: సబితా ఇంద్రారెడ్డి ధీమా**

**మొయినాబాద్,జూలై 12 (ప్రజాక్షేత్రం)**

మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని హిమాయత్ నగర్‌లో పేదలకు కేటాయించిన 60 గజాల స్థలాల హక్కుల కోసం సాగుతున్న నిరసన దీక్షలు ఆదివారంతో 17వ రోజుకు చేరుకున్నాయి. తమకు న్యాయం జరగాలంటూ బాధితులు, వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు చేస్తున్న ఈ ధర్నాకు టీఆర్ఎస్ (బీఆర్ఎస్) పార్టీ పూర్తి మద్దతు ప్రకటించింది. ధర్నా శిబిరాన్ని సందర్శించిన మాజీ మంత్రి, పార్టీ ముఖ్య నాయకురాలు సబితా ఇంద్రారెడ్డి బాధితులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గతంలో పేదల కష్టాలను గుర్తించి ఈ 60 గజాల స్థలాలకు పట్టాలు మంజూరు చేసింది టీఆర్ఎస్ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. హక్కుల సాధన కోసం సాగుతున్న ఈ పోరాటంలో నిరసనకారులు ఎవరూ వెనక్కి తగ్గాల్సిన అవసరం లేదని, పార్టీ తరఫున తాము పూర్తి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. రాబోయే రోజుల్లో మళ్లీ తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే, పట్టాలు పొందిన వారందరికీ ఇళ్లను కూడా తామే నిర్మించి ఇస్తామని ఈ సందర్భంగా ఆమె ప్రకటించారు. ఈ నిరసన కార్యక్రమంలో మండల ముఖ్య నాయకులు కొంపల్లి అనంతరెడ్డి, మండల ప్రెసిడెంట్ రెడ్డి వెంకట్ రెడ్డి, హిమాయత్ నగర్ స్థానిక నేతలు శ్రీహరి యాదవ్, రవి యాదవ్,ఎన్కేపల్లి నేతలు కుమ్మరి రాము,చిటిమిల్ల దామోదర్ రెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.



## నోముల రాంరెడ్డి ఆశయాలను సాధిద్దాం

- **మాటూరి బాలరాజు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు**

**వలిగొండ జులై 12(ప్రజాక్షేత్రం):**

అమరజీవి కామ్రేడ్ నోముల రామిరెడ్డి ఆశయాలను సాధించేందుకు కృషి చేయడమే ఆయనకు నిజమైన నివాళి అని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజు, జిల్లా కమిటీ సభ్యులు మద్దెల రాజయ్య, మండల కార్యదర్శి సిర్పంగి స్వామి అన్నారు. ఆదివారం వలిగొండ మండలంలోని సంగెం గ్రామంలో నోముల రామిరెడ్డి 20వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పేదల కోసం జీవితాంతం పోరాడిన నోముల రామిరెడ్డి ప్రభుత్వ బంచరాయి, పోరంబోకు భూములను భూమిలేని పేదలకు, వివిధ వృత్తిదారులకు అందించేందుకు అనేక ఉద్యమాలు నిర్వహించి ప్రభుత్వాలను ఒప్పించారని తెలిపారు.
సీపీఎం పార్టీ విస్తరణకు ఆయన విశేషంగా కృషి చేశారని, పేదల సమస్యల పరిష్కారం ప్రజా ఉద్యమాలతోనే సాధ్యమనే నమ్మకంతో పనిచేశారని పేర్కొన్నారు. ఆయన స్ఫూర్తితో నేటి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటాలను మరింత ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు నోముల జంగారెడ్డి, కవిడే సురేష్, భీమనబోయిన జంగయ్య, మాజీ సర్పంచ్ కాసుల కృష్ణ, అంగిడి దేవేందర్ రెడ్డి, ఏనుగు ప్రభాకర్ రెడ్డి, మల్లారెడ్డి, వివిధ పార్టీల నాయకులు, రామిరెడ్డి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# ఓటరు జాబితా సవరణను సద్వినియోగం చేసుకోండి

- **పెబ్బేరులో ఎస్ఐఆర్ ఆటో ప్రచారానికి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి శ్రీకారం**

**వనపర్తి,జూలై 12 (ప్రజాక్షేత్రం):**

సమగ్ర ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పిలుపునిచ్చారు. పెబ్బేరు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఓటరు జాబితా ప్రత్యేక సవరణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన ఆటో ప్రచారాన్ని ఆదివారం ఆయన జెండా ఊపి ప్రారంభించారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటు హక్కే మూలస్తంభమని, అర్హత ఉన్న ప్రతి పౌరుడు తప్పనిసరిగా ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని కోరారు. 18 సంవత్సరాలు నిండిన యువత కొత్త ఓటరుగా నమోదు చేసుకోవడంతో పాటు, ఇప్పటివరకు పేరు నమోదు కానివారు, ఓటరు జాబితాలో పేరు లేనివారు, చిరునామా మార్పు, పేరు లేదా ఇతర వివరాల సవరణ, తొలగింపు వంటి సేవలను ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమం ద్వారా పొందవచ్చని తెలిపారు.
ఓటరు జాబితా పరిశుభ్రంగా, పారదర్శకంగా ఉండేందుకు భారత ఎన్నికల సంఘం చేపట్టిన ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. చివరి తేదీ వరకు వేచి చూడకుండా సంబంధిత బూత్ లెవల్ అధికారులను సంప్రదించి వెంటనే దరఖాస్తులు సమర్పించాలని కోరారు.
ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించేందుకు మున్సిపాలిటీ చేపట్టిన ఆటో ప్రచారం అభినందనీయమని ఎమ్మెల్యే అన్నారు. ప్రతి వార్డు, వీధి, కాలనీలో ప్రచారం నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు తమ కుటుంబ సభ్యులు, బంధువులు, పొరుగువారికి కూడా ఈ కార్యక్రమంపై అవగాహన కల్పించి అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. బాధ్యతాయుతమైన ఓటరుగా హక్కు వినియోగించుకోవాలంటే ముందుగా ఓటరు జాబితాలో పేరు నమోదు కావడం తప్పనిసరి అని స్పష్టం చేశారు.
కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, వైస్ చైర్మన్ సుమిత్ర ఎల్లారెడ్డి, మార్కెట్ యార్డ్ అధ్యక్షురాలు ప్రమోదిని రెడ్డి, ఉపాధ్యక్షుడు విజయవర్ధన్ రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు దయాకర్ రెడ్డి,కౌన్సిలర్లు,మాజీ కౌన్సిలర్లు,సర్పంచులు,కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## చలో ప్రాజెక్ట్ ఆఫీసర్ ఆఫీస్ ముట్టడిని జయప్రదం చేయండి

**భద్రాచలం,జూలై12(ప్రజాక్షేత్రం):**

భద్రాచలం ఐటిడిఏ ఆఫీసు ఉన్నది గిరిజన ఆదివాసీల కోసమా? లేక ఫారెస్ట్ అధికారుల కోసమా? లేక గిరిజనేతరుల కోసమా? అనేది అర్థం కావడం లేదని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ భద్రాచలం డివిజన్ కార్యదర్శి కామ్రేడ్ ముసలి సతీష్ ప్రశ్నించారు.
తాతల ముత్తాతల నుండి గడ్డోరీగట్టు గిరిజన ఆదివాసీ ప్రజలు పోడుభూమి కొట్టుకొని అడవిలోనే జీవిస్తున్నామని దాన్ని గుర్తించిన పాలకులు ప్రభుత్వాలు అధికారులు మాకు గ్రామ సభ తీర్మానం,పిసా యాక్ట్, 1/70 అటవీ హక్కుల చట్టం ప్రకారం అన్ని సర్వేలు నిర్వహించి ఆదివాసీలకు ఆర్ ఎఫ్ ఓ ఆర్ పట్టాలను ఇచ్చారు.ఇప్పుడు కొత్తగా ఫారెస్ట్ వారు మా పర్మిషన్ లేకుండా అటవీ హక్కుల చట్టాన్ని ఫిసా యాక్టిని ఉల్లంఘించి మా ప్రాంతంలోకి అడుగుపెట్టి మా అడవుల్లో ఉన్నటువంటి భూములను తిరిగి ఇవ్వాలని బెదిరిస్తూ అక్రమ కేసులు పెడతామని ఆదివాసీలను అమాయకులను బెదిరించి వేధింపులకు గురిచేస్తూ భూములను ఆక్రమించుకోవడం కోసం ప్రయత్నం చేస్తున్నారు. ఐటిడిఏ అధికారులకు ఫారెస్ట్ వారికి ఎంత చెప్పినా అర్థం కావడం లేదు. అసలు ఐటీడీఏ ఆఫీసు ఆదివాసీల కోసం ఉన్నదా లేకపోతే ఆదివాసులను ఇబ్బందులు పెడతానికి ఉన్నదా ?లేకపోతే ఆదివాసీల మీద దాడులు కావాలని ఐటిడిఏ అధికారులు చేపిస్తున్నారు. అనిపిస్తుంది ఒకపక్క ఫారెస్ట్ వారు చట్టాలను ఉల్లంఘించి పోడు భూములను గుంజుకొని సర్వేలు చేయకుండా జామాయిల్ మొక్కలు వేస్తూ కనీసం పండ్లచెట్లు తోటలో ఏమి వేయకుండా జామ్ ఆయిల్ వేస్తూ ఒక రకంగా బిపిఎల్ కంపెనీకి తొత్తులుగా మారి మా భూమిని ఆక్రమించుకొని బిజినెస్ చేస్తారేమో అది చేయించాలని ఐటీడీఏ ఆఫీసు అందులో ఉన్న అధికారులు ఆలోచన చేస్తున్నారేమో అని ఆలోచన వస్తుంది కావున తక్షణమే ఆదివాసుల కోసం ఏర్పాటు చేసిన ఐటీడీఏ ఆఫీసు కళ్ళు తెరవాలి ఆదివాసీలను కాపాడుకోవాలి ఎలాంటి చట్టాలు లేకుండా చట్టాల ఉల్లంఘన చేసి భూములను గుంజుకుంటున్న ఫారెస్ట్ అధికారులపై చర్యలు తీసుకోవాలని లేనియెడల ఆందోళన పూనుకుంటామని వారు పిలుపునిచ్చారు రేపు ఈ సమస్య మీద ఐటిడిఏ ముట్టడి ఉంటుందని అధికారులను ఎవరిని పోరి ఇవ్వకుండా గేటు దగ్గరే ఘెరవు చేస్తామని వారి పిలుపునిచ్చారు.
ఈ సమస్య రేపు పరిష్కారం కాకపోతే ఐటీడీఏ నుండి మొదలుకొని హైదరాబాదులో చీఫ్ కన్వెన్షర్ ఆఫీసు వరకు ముట్టడి కార్యక్రమాలు చేస్తామని అవసరమైతే ఆదివాసీలు తిరుగుబాటు చేయవలసి వస్తుందని వారు అన్నారు.
అడవిలో పుట్టి అడవిలో పెరిగి అడవినే నమ్ముకొని బ్రతుకుతున్న అడవికే మూలవాసులైన ఆదివాసులమైన మాపైనే ఫారెస్ట్ వారి జులుం చూపిస్తున్నారని భూమి పోయినాక ఆదివాసీలమైన మేం బ్రతకడం ఎందుకని ప్రశ్నిస్తున్నార. మీరు ఆదివాసీల పక్షాన ఉంటారా ఫారెస్ట్ వారి పక్షాన ఉంటారా తెలుసుకోమని మేము కూడా అడుగుతున్నాం కావున ఈ సమస్య పరిష్కారానికి పిఓ గారు పూనుకొని తక్షణమే ఆదివాసులకు న్యాయం చేయాలని ఆర్ ఎఫ్ ఓ ఆర్ పట్టాలు ఉన్న భూముల జోలికి పోకుండా అవి వారికి అప్పుజెప్పాలని ఈ సిపిఐ (ఎంఎల్ )న్యూడెమోక్రసీ పార్టీగా తెలియజేస్తున్నారు.ఈ కార్యక్రమంలో మట్ట నరసింహారావు కుంజ జోగారావు రామప్ప రమేష్ లక్ష్మి రాజేశ్వరి రాధ భీమయ్య తదితరులు పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో న్యూ డెమోక్రసీ మండల నాయకులు కుంజ జోగారావు మట్ట నరసింహారావు సమ్మక్క లక్ష్మణరావు తిరుమలరావు రమేష్ రామక్క రవణక్క కమల అక్క సరోజిని లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



## వలిగొండలో ఎరువుల దుకాణాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్

**వలిగొండ జులై 12(ప్రజా-క్షేత్రం):**



యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో ఆదివారం రోజున గ్రోమోర్ ఎరువులు, విత్తనాల షాప్ ని తనిఖీ నిర్వహించిన జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ప్రస్తుతం షాప్ లో యూరియా,డి ఏ పి ఎంత స్టాక్. రైతులు ఎంత కొనుగోలు చేసారు అని అడిగి తెలుసుకున్నారు రైతులు డైరెక్ట్ గా వచ్చి కొనుగోలు చేస్తున్నారా లేక ఫర్టిలైజర్ అప్ లో బుక్ చేసుకున్న వారికి అమ్ముతున్నారా అని అప్ లో చెక్ చేసారు.. ఈ సీజన్ లో రైతులు ఎక్కువగా ఏ పంట సాగు చేయడానికి విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు ఎల్ నీనో ఎఫెక్ట్ ఉంది కాబట్టి వరి కాకుండా రైతులకు అవసరమైన ఎరువులు విత్తనాలు, పత్తి, కందులు వంటి రైతులకు సకాలంలో అందుబాటులో ఉండేలా నిల్వలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అక్రమ నిల్వలు జరగకుండా నిరంతరం తనిఖీలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు ఈ తనిఖీల్లో వలిగొండ తహసిల్దార్ జి.దశరథ వ్యవసాయ అధికారి అంజలిదేవి మండల తదితరులు పాల్గొన్నారు.



## తెలుగు పాటకు మధుర జ్ఞాపకం.. ఎస్ జానకి స్వరం చిరస్థాయిగా

- **సాహితీ కళా వేదిక ఆధ్వర్యంలో ఘన నివాళి..**
- **సంగీత ప్రపంచానికి తీరని లోటని పలుస శంకర్ గౌడ్ వ్యాఖ్య**

**వనపర్తి,జూలై 12 ( ప్రజాక్షేత్రం):**


తన అపూర్వమైన మధుర స్వరంతో తెలుగు సినీ సంగీతానికి చిరస్మరణీయమైన సేవలందించిన ప్రముఖ నేపథ్య గాయని ఎస్ జానకి మరణం భారతీయ సంగీత ప్రపంచానికి తీరని లోటని సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ పేర్కొన్నారు. ఆదివారం సాహితీ కళా వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన సంతాప సభలో సభ్యులు ఎస్ జానకి చిత్రపటానికి పూల మాలలు వేసి, రెండు నిమిషాల మౌనం పాటించి ఘనంగా నివాళులర్పించారు.
ఈ సందర్భంగా పలుస శంకర్ గౌడ్ మాట్లాడుతూ.. ఆరు దశాబ్దాలకు పైగా సాగిన తన సంగీత ప్రస్థానంలో తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీతో పాటు పలు భారతీయ భాషల్లో యాభై వేలకుపైగా పాటలు ఆలపించి కోట్లాది మంది సంగీతాభిమానుల హృదయాల్లో శాశ్వత స్థానం సంపాదించుకున్న అరుదైన గాయని ఎస్ జానకి అని కొనియాడారు. ఆమె స్వరంలో ఉన్న మాధుర్యం, భావవ్యక్తీకరణ, పద స్పష్టత, సంగీతంపై ఉన్న అంకితభావం వల్ల ప్రతి పాటకు కొత్త జీవం పోసేవారని చెప్పారు.
నవరసాలను తన గాత్రంలో సహజంగా పలికించే అసాధారణ ప్రతిభ జానకి సొంతమని అన్నారు. కథానాయికల పాత్రలకే కాకుండా చిన్నారులు, వృద్ధులు, హాస్య పాత్రలు, విషాద భరిత పాత్రలు, భక్తి గీతాలు, జానపద గీతాలు, ప్రేమగీతాలు వంటి విభిన్న సందర్భాలకు తన గాత్రంతో ప్రాణం పోసి శ్రోతలను మంత్రముగ్ధులను చేశారని తెలిపారు. ఆమె ఆలపించిన ఎన్నో పాటలు తరతరాలుగా సంగీతాభిమానుల హృదయాల్లో నిలిచిపోతూ నిత్యం వినిపిస్తూనే ఉంటాయని పేర్కొన్నారు.తెలుగు సినీ సంగీత చరిత్రలో ఎస్ జానకి ఒక స్వర్ణయుగాన్ని సృష్టించారని, ఆమె పాటలు సంగీత విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తాయని శంకర్ గౌడ్ అన్నారు. అవార్డులు, ప్రశంసలు ఎన్నో అందుకున్నప్పటికీ ఎంతో నిరాడంబరంగా జీవించిన మహోన్నత వ్యక్తిత్వం ఆమెదని గుర్తుచేశారు. తెలుగు పాట ఉన్నంతకాలం ఎస్ జానకి పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందని, ఆమె స్వరం ఎప్పటికీ సంగీతాభిమానుల గుండెల్లో మారుమోగుతూనే ఉంటుందని అన్నారు. సాహితీ కళా వేదిక సభ్యులు మాట్లాడుతూ.. ఎస్ జానకి మరణం ఒక యుగాంతమని, ఆమె గాత్ర మాధుర్యాన్ని భవిష్యత్ తరాలు కూడా స్మరించుకుంటూనే ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆమె ఆలపించిన కొన్ని చిరస్మరణీయ గీతాలను గుర్తు చేసుకుంటూ సభ్యులు భావోద్వేగానికి గురయ్యారు. ఈ కార్యక్రమంలో సాహితీ కళా వేదిక ప్రతినిధులు కందూరు నారాయణ రెడ్డి, బైరోజు చంద్రశేఖర్, బండారు శ్రీనివాస్, నాగేంద్రం గౌడ్, పి. శ్రీనివాసులు, ఉప్పరి తిరుమలేశ్, బొజ్జిబాబు, రాజేంద్రచారి, ఆజాం తదితరులు పాల్గొని ఎస్ జానకికి ఘనంగా నివాళులర్పించారు.

## మధుర గాన కోకిలమ్మ కి అక్షర నీరాజనం.

**భద్రాచలం,జూలై12:(ప్రజాక్షేత్రం):**

అమర గాయని, సుమధుర గాన కోకిలమ్మ ఎస్.జానకమ్మ మృతికి దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ భద్రాద్రి మెలోడీ సింగర్స్ గ్రూప్ భద్రాచలం వారి ఆధ్వర్యంలో గాయనీ గాయకులందరూ స్థానిక శ్రీ దుర్గా కళా నిలయం లో ఎస్. జానకి.. చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.
బాల్య దశ నుండి దాదాపు అరవై సంవత్సరాల సినీ సంగీత ప్రస్థానం సాగించారనీ.. తెలుగులోనే కాదు ఇతర భాషల చిత్రాలకు కూడా పాటలు పాడిన ఘనతను సాధించారనీ.. సన్నటి స్వర మాధుర్యం నిన్నటి వరకు చెక్కు చెదరలేదనీ ,ఆ మధుర గీతాలు అభిమానుల గుండెల్లో చిరకాలం అలరిస్తూనే వుంటాయని, సంగీతం పై నిబద్ధత ను,సంగీత కళా నైపుణ్యాన్ని.. సహృదయతను నేటి గాయకులంతా అలవర్చుకోవాలని,పరిపరి విధాలుగా ఆమె జీవితాన్ని అభినందిస్తూ...జానకి కుటుంబ సభ్యులకు సానుభూతిని సంతాపాన్ని వ్యక్తం చేస్తూ..ఆ మహనీయ గాయని కి ఘనంగా నివాళులు సమర్పించారు. నివాళులు సమర్పించిన వారు..జే ఆర్ మూర్తి,తాతోలు దుర్గా చారి, డాక్టర్ విజయ రావు, శ్రీనివాస బాబు,జి. జాన్సన్,జే.నాగలక్ష్మి,చిట్టె లలిత,ఎస్. లక్ష్మీకాంతం,వాణీ మేడం, రామలక్ష్మి,కుంజా నాగలక్ష్మి,ఎస్.రాజశ్రీ తదితరులు ఉన్నారు.





## సర్ ప్రక్రియలో ప్రతి అర్హుడి పేరు నమోదు కావాలి

- **చిట్యాలలో ఓటరు జాబితా ప్రత్యేక సవరణను పరిశీలించిన మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి**

**వనపర్తి,జూలై 12 (ప్రజాక్షేత్రం):**

ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో ప్రతి అర్హుడి పేరు తుది జాబితాలో ఉండేలా అధికారులు, బీఎల్‌వోలు కృషి చేయాలని మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి సూచించారు. వనపర్తి మండలం చిట్యాల గ్రామ పంచాయతీ కార్యాలయంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను ఆయనఆదివారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్‌వోలకు పలు సూచనలు చేస్తూ గ్రామాల్లోని ప్రతి ఓటరిని ప్రత్యక్షంగా కలిసి ఎస్ఐఆర్‌పై అవగాహన కల్పించాలని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కు పరిరక్షించబడేలా తుది జాబితా రూపొందించాలని సూచించారు.

బీఆర్ఎస్ పార్టీ బీఎల్ఏలు ఓటరు నమోదు దరఖాస్తులను తప్పులు లేకుండా పూరించేందుకు ప్రజలకు సహకరించాలని, పార్టీ నాయకులు, కార్యకర్తలు కూడా సర్ ప్రక్రియలో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఓటరు నమోదు సందర్భంగా ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో గట్టు యాదవ్, వాకిటి శ్రీధర్, నందిమల్ల అశోక్, కె. మాణిక్యం, భానుప్రకాశ్‌రావు, సర్పంచ్ శోభా కృష్ణయ్య, రఘువర్ధన్ రెడ్డి, మాధవ్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, చిట్యాల రాము, బీఎల్‌వోలు భాగ్యమ్మ, సుమిత్రమ్మ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

**వనపర్తిలో శుభకార్యాలలో మాజీ మంత్రి దంపతులు నూతన గృహ సందర్శన.. వ్రత కార్యక్రమంలో ప్రత్యేక పూజలు**

మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, ఆయన సతీమణి సింగిరెడ్డి వాసంతి తో కలిసి ఆదివారం వనపర్తి పట్టణంలో పలు శుభకార్యాలలో పాల్గొని కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. మొదటగా పట్టణంలోని 30వ వార్డుకు చెందిన జాగృతి కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ అంబటి వినోద్ కుమార్ నూతన గృహాన్ని సందర్శించారు. ఇటీవల జరిగిన గృహప్రవేశ కార్యక్రమానికి విదేశీ పర్యటన కారణంగా హాజరు కాలేకపోయిన మాజీ మంత్రి, స్వదేశానికి తిరిగి వచ్చిన అనంతరం వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను అభినందించారు. నూతన గృహంలో సుఖశాంతులు, ఐశ్వర్యాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.

అనంతరం 30వ వార్డుకు చెందిన మోహన్ చారి నివాసంలో నిర్వహించిన వ్రత కార్యక్రమానికి దంపతులు హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ ఆశీర్వదించారు.

ఈ కార్యక్రమాల్లో మాజీ మంత్రి దంపతుల వెంట వాకిటి శ్రీధర్, భాగ్యరాజు,హేమంత్ ముదిరాజ్, చిట్యాల రాము, గాలిగల్ల క్రాంతి, అశ్విని శివ,కావలి రాకేష్, సంతోష్,రాజు,పార్టీ నాయకులు, కార్యకర్తలు,కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.



## సాంబమూర్తి ఆలయంలో అద్భుతం: శివలింగంపై శ్వేతనాగు ప్రత్యక్షం!

**పెద్దపల్లి జులై 12(ప్రజాక్షేత్రం):**

పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం రచ్చపల్లి గ్రామంలోని శ్రీసాంబమూర్తి ఆలయంలోకి ఆదివారం శ్వేతనాగు ప్రవేశించింది..ఈ ఆలయం కాకతీయుల కాలంలో నిర్మించగా భక్తులు దీనిని పునరుద్ధరించి గత దశాబ్దాలుగా శివుడికి నిత్య పూజలు నిర్వహిస్తున్నారు ఇక్కడ ప్రతి యేట శివరాత్రి పర్వదినాన ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఉత్సవాలు కొనసాగుతున్నాయి కాగా ఈ ఆలయానికి ఎంతోప్రతిష్ట ఉంది.ఈ ఆలయంలో నిత్య పూజలు జరుగుతుంటాయి. ఈ ఆలయంను అనుకుని పక్కనే గల నాగదేవత గుడిలో పాము పుట్ట కూడా ఉంది ఆలయ పూజారి శ్రీనివాసాచారి ఎప్పటి మాదిరిగానే ఆదివారం ఉదయమే ఆలయ గర్భగుడి తలుపులు తెరవగానే శివలింగం పక్కన శ్వేత నాగు ప్రత్యక్షమైంది ..దీంతో సర్వత్ర చర్చ మొదలైంది. శివుడి మహిమ వల్లే నాగు పాము ప్రవేశించి ఉంటుందని గ్రామస్తులు భావిస్తున్నారు.



# రాజకీయ జగడాలు కాదు.. రైతుకు సాగు జలాలు కావాలి

- **కాళేశ్వరం, పాలమూరు–రంగారెడ్డిపై రాజకీయాలు మానాలి**
- **సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ధ్వజం**

**వనపర్తి,జూలై 12 (ప్రజాక్షేత్రం):**





రాష్ట్రంలో ప్రజల సమస్యలను పక్కనబెట్టి రాజకీయ ఆరోపణలు, ప్రత్యారోపణలతో కాలక్షేపం చేయడం మానేసి రైతులకు సాగునీరు అందించే దిశగా ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పనిచేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే, సీపీఐ శాసనసభాపక్ష నేత కూనంనేని సాంబశివరావు అన్నారు. వనపర్తిలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన సీపీఐ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మూడు రోజుల రాజకీయ శిక్షణా తరగతుల ముగింపు సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన ప్రసంగించారు.

**కాళేశ్వరంపై బూతు రాజకీయాలు తగవు**

కాళేశ్వరం ప్రాజెక్టు కన్నెపల్లి రిజర్వాయర్‌ను నింపాలని బీఆర్ఎస్ నేతలు హరీశ్‌రావు, కేటీఆర్ డిమాండ్ చేస్తుండగా, నింపితే ప్రాజెక్టుకు ప్రమాదం ఏర్పడుతుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించడం బాధాకరమన్నారు. ఇలాంటి అంశాలపై నీచ రాజకీయాలు, పరస్పర విమర్శలు, బూతు పురాణాలు ప్రజలకు మేలు చేయవని, అధికార-ప్రతిపక్షాలు సంయమనం పాటించాలని సూచించారు. కాళేశ్వరం పిల్లర్ల కుంగుబాటుపై మూడు సంవత్సరాల క్రితమే నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ పరిశీలించి సెంట్రల్ వాటర్ కమిషన్‌కు నివేదిక పంపిందని, ఇప్పటికీ తుది నిర్ణయం వెలువడలేదన్నారు. సీడబ్ల్యూసీ నివేదిక ఆధారంగానే తదుపరి చర్యలు చేపట్టాలని, రాజకీయ నిర్ణయాలు తీసుకోవడం సరికాదని స్పష్టం చేశారు.

**పాలమూరు–రంగారెడ్డికి జాతీయ హోదా ఇవ్వాలి**

ఆంధ్రప్రదేశ్‌లోని పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించిన కేంద్ర ప్రభుత్వం తెలంగాణలోని పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు కూడా అదే హోదా కల్పించాలని డిమాండ్ చేశారు. అలా చేస్తేనే తెలంగాణకు సమన్యాయం జరిగినట్లవుతుందని అన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే ఉమ్మడి మహబూబ్‌నగర్‌తో పాటు రంగారెడ్డి, నల్గొండ జిల్లాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. జూరాల, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్ తదితర పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

**కమ్యూనిస్టు ఉద్యమం రాజీలేని పోరాటాల చరిత్ర**

భారత కమ్యూనిస్టు పార్టీ వందేళ్లకు పైగా ప్రజల పక్షాన రాజీలేని పోరాటాలు సాగిస్తోందని సాంబశివరావు అన్నారు. కమ్యూనిస్టు పార్టీని విమర్శించే వారు ఒక్కరోజైనా కమ్యూనిస్టుగా జీవిస్తే ఆ సిద్ధాంతం గొప్పతనం అర్థమవుతుందని వ్యాఖ్యానించారు. దోపిడీ లేని సమాజ నిర్మాణమే కమ్యూనిస్టు ఉద్యమ లక్ష్యమని, ఎక్కడ అన్యాయం జరిగినా అక్కడ ఎర్రజెండా పోరాటం తప్పకుండా ఉంటుందని పేర్కొన్నారు. రాజకీయ శిక్షణా తరగతులు పార్టీకి జీవం వంటివని, కార్యకర్తలు సిద్ధాంతంతో పాటు సమకాలీన రాజకీయ పరిణామాలను అధ్యయనం చేయాలని సూచించారు.

**కేంద్ర ప్రభుత్వ విధానాలపై విమర్శలు**

దేశం తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం ప్రజల దృష్టిని మళ్లించేందుకు హిందుత్వ రాజకీయాలను ముందుకు తెస్తోందని ఆరోపించారు. రాజ్యాంగ విలువలను బీజేపీ ప్రభుత్వం దెబ్బతీస్తోందని విమర్శించారు. దేశ సంపద కొద్దిమంది కార్పొరేట్ సంస్థల చేతుల్లో కేంద్రీకృతమయ్యే విధానాలు అమలు చేస్తున్నారని, పేదల సంక్షేమ పథకాలను ఉచితాల పేరుతో విమర్శించే కేంద్రం, అదే సమయంలో కార్పొరేట్ కంపెనీలకు లక్షల కోట్ల రూపాయల రాయితీలు ఎందుకు ఇస్తోందని ప్రశ్నించారు.

**హామీలు అమలు చేయాలి.. పేదలకు పట్టాలు ఇవ్వాలి**

ఎన్నికల సమయంలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటినీ వెంటనే అమలు చేయాలని కోరారు. ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న పేదలకు ఇంటి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పేదల గుడిసెలను కూల్చివేస్తే ప్రజా ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పార్టీ శ్రేణులు పోరాటాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఆగస్టు 9 నుంచి 16 వరకు దేశవ్యాప్తంగా పాదయాత్రలు, సెప్టెంబర్ 1న ఢిల్లీలో భారీ ప్రజా ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు వెల్లడించి, వాటిని విజయవంతం చేయాలని కోరారు.

**విప్లవోద్యమ చరిత్రపై శిక్షణ**

ఈ సందర్భంగా సీపీఐ నేత జితేందర్‌రెడ్డి "భారత కమ్యూనిస్టు పార్టీ విప్లవోద్యమ చరిత్ర" అంశంపై రాజకీయ శిక్షణా తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాల నరసింహ, రాష్ట్ర సమితి సభ్యులు వార్ల వెంకటయ్య, కేశవులు గౌడ్, వనపర్తి జిల్లా కార్యదర్శి విజయరాములు, నాగర్ కర్నూలు జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్, మహబూబ్‌నగర్ జిల్లా కార్యదర్శి బాలకిషన్, గద్వాల జిల్లా కార్యదర్శి బి. ఆంజనేయులు, నారాయణపేట జిల్లా కార్యదర్శి నరసింహులు, వనపర్తి నియోజకవర్గ కార్యదర్శి జె రమేష్, వివిధ జిల్లాల పార్టీ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సర్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలి

- **వికారాబాద్ జిల్లా కలెక్టరేట్ ఎన్నికల సూపరింటెండెంట్ నియామత్ అలీ**
- **ఈ నెల 20లోగా 95 శాతం డిజిటలైజేషన్ పూర్తి చేయాలి**
- **బీఎల్‌వోలు క్షేత్రస్థాయిలో మరింత చురుకుగా పనిచేయాలి**
- **గ్రామస్తులు త్వరగా ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించాలి**
- **అన్ని శాఖల సమన్వయంతో సర్ ప్రక్రియ పూర్తి చేయాలి**

**పెద్దేముల్,జూలై 12 (ప్రజాక్షేత్రం):**



స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ఎన్యూమరేషన్ ఫారాల స్వీకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి నిర్దేశిత గడువులోగా డిజిటలైజేషన్ పూర్తి చేయాలని వికారాబాద్ జిల్లా కలెక్టరేట్ ఎన్నికల సూపరింటెండెంట్ నియామత్ అలీ ఆదేశించారు.

ఆదివారం పెద్దేముల్ మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలోకొనసాగుతున్న సర్ ఎన్యూమరేషన్ ఫారాల స్వీకరణ, డిజిటలైజేషన్ ప్రక్రియను మండల డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ కే.తిరుమల స్వామి,పెద్దేముల్ గ్రామ సర్పంచ్ డివై.నర్సింహులు, ఉపసర్పంచ్ డివై.ప్రసాద్, పెద్దే ముల్ గ్రామపంచాయతీ కార్యదర్శి లాలప్పలతో కలిసి ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా వికారాబాద్ జిల్లా ఎన్నికల సూపరింటెండెంట్ నియామత్ అలీ మాట్లాడుతూ.. పెద్దేముల్ మండలంలో ఇప్పటి వరకు సుమారు 35% శాతం సర్ ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ పూర్తయిందని,సోమవారం నాటికి దానిని 50% శాతానికి పెంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.అలాగే ఈ నెల 20వ తేదీలోగా 95% శాతం ఫారాల స్వీకరణతో పాటు ఆన్‌లైన్ డిజిటలైజేషన్ కూడా పూర్తి చేయాలని సూచించారు.గ్రామీణ ప్రాంత ప్రజలు తమ సర్ ఎన్యూమరేషన్ ఫారాలను పూర్తిస్థాయిలో నింపి సంబంధిత బీఎల్ఓలకు వీలైనంత త్వరగా అందజేయాలని కోరారు. పెద్దేముల్ మండలంలో ఉన్న అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి సర్ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని సూచించారు.డిజిటలైజేషన్ పనులను వేగవంతం చేసేందుకు ఆయా గ్రామాల బీఎల్ఓ లు ఆయా గ్రామాల్లోని వీవోఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, రిజర్వ్ లో ఉన్న పంచాయతీ కార్యదర్శులు,అంగన్‌వాడీ సిబ్బంది సహకారాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకొని సర్ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు.వికారాబాద్ జిల్లాలో తాండూర్ నియోజకవర్గం సర్ డిజిటలైజేషన్‌లో వెనుకబడి ఉండగా,తాండూరు నియోజకవర్గంలో పెద్దేముల్ మండలం కూడా వెనుకబడిన స్థానంలో ఉందని పేర్కొన్నారు. ఈ పరిస్థితిని అధిగమించేందుకు క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ప్రజలు వీలైనంత త్వరగా ఫారాలు సమర్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.ఆయా గ్రామాల ప్రజలు ఈ నెల 15 లోపు తమ సర్ ఎన్యూమరేషన్ ఫారాలను నింపి సంబంధిత బీఎల్ఓలకు అందజేయడంతో పాటు డీజిటలైజేషన్ ప్రక్రియను కూడా పూర్తిచేసుకోవాలని సూచించారు.

పెద్దేముల్ గ్రామ సర్పంచ్ డివై నర్సింహులు,ఉపసర్పంచ్ డివై ప్రసాద్,పంచాయతీ కార్యదర్శి లాలప్పలు మాట్లాడుతూ.... పెద్దేముల్ గ్రామ 5ప్రజలు ప్రతీ ఒక్కరు ఈ నెల 15వ తేదీలోపు తమ సర్ ఎన్యూమరేషన్ పత్రాలను బీఎల్ఓలకు అందించి డీజిటలైజేషన్ ప్రక్రియ త్వరగా పూర్తయ్యేలా గ్రామ ప్రజలు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కే.తిరుమల స్వామి, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు ,సర్పంచ్ డివై.నర్సింహులు, ఉపసర్పంచ్ డివై. ప్రసాద్, గ్రామపంచాయతీ కార్యదర్శి లాలప్ప, ఐసీడీఎస్ సూపర్వైజర్ మీనాక్షి, తహసీల్దార్ కార్యాలయ రికార్డు అసిస్టెంట్ మహేష్, ఆయా పోలింగ్ బూత్ ల బీఎల్ఓలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## డ్రీమ్ వ్యాలీ ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యం

- **పాదయాత్రలో బండి రమేష్ హామీ**

**కూకట్‌పల్లి,జూలై 12(ప్రజాక్షేత్రం):**

కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ శ్రీ బండి రమేష్ గారు ఆదివారం వసంత్‌నగర్ డివిజన్ పరిధిలోని మాకినేని వినోద్ ఆధ్వర్యంలో డ్రీమ్ వ్యాలీ కాలనీలో ప్రత్యేక పాదయాత్ర నిర్వహించి స్థానిక ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు ఎన్నో సంవత్సరాలుగా ప్రధాన డ్రైనేజ్ సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, అనేక ప్రాంతాల్లో స్ట్రీట్ లైట్లు లేక ప్రజలు రాత్రి వేళల్లో అసౌకర్యానికి గురవుతున్నారని, అంతర్గత రహదారులు పూర్తిగా దెబ్బతిని ప్రయాణానికి అనుకూలంగా లేవని బండి రమేష్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల సమస్యలను ఓర్పుగా విన్న బండి రమేష్ మాట్లాడుతూ, ప్రధాన డ్రైనేజ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించేందుకు సంబంధిత అధికారులతో సమన్వయం చేసి వెంటనే చర్యలు చేపడతామని, అవసరమైన చోట్ల స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేయించి, దెబ్బతిన్న రోడ్ల నిర్మాణ పనులు కూడా త్వరితగతిన ప్రారంభించేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే, "డ్రీమ్ వ్యాలీ కాలనీ ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని తప్పకుండా నెరవేరుస్తాను. ఈ సమస్యలు పూర్తిగా పరిష్కారమయ్యే వరకు ఈ కాలనీని విడిచిపెట్టను. అవసరమైతే మళ్లీ పాదయాత్ర నిర్వహించి పనుల పురోగతిని స్వయంగా పరిశీలిస్తాను" అని బండి రమేష్ పేర్కొన్నారు.ప్రజలకు ఎలాంటి సమస్య వచ్చినా తనను నేరుగా సంప్రదించవచ్చని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే ప్రజా నాయకుడిగా సేవలు అందిస్తానని ఆయన భరోసా ఇచ్చారు. డ్రీమ్ వ్యాలీ కాలనీలో



నిర్వహించిన ఈ పాదయాత్రకు తూము వేణు, శ్రీనివాస్ బాబు, గాలి బాలాజీ ,దినేష్ కుమార్, రంగమోహన్,గోపాల్ చౌదరి, చావా శ్రీనివాస్, శివ చౌదరి, సాయిబాబా చౌదరి, సంధ్య , రజిత,కాంగ్రెస్ నాయకులు, , కార్యకర్తలు, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, మహిళలు, యువకులు,పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## లార్డ్స్ మైదానంలో చరిత్ర సృష్టించిన భారత బ్యాటర్ యస్తికా భాటియా

- లార్డ్స్‌లో టెస్ట్ సెంచరీ చేసిన తొలి మహిళా క్రికెటర్‌గా యస్తికా భాటియా
- ఇంగ్లండ్‌తో జరుగుతున్న ఏకైక టెస్టులో ఈ అరుదైన ఘనత
- తీవ్ర గాయం నుంచి కోలుకొని వచ్చి చారిత్రక ఇన్నింగ్స్ ఆడిన యస్తికా
- సహచర బౌలర్ క్రాంతి గౌడ్ తర్వాత లార్డ్స్ ఆనర్స్ బోర్డుపైకి ఎక్కిన భారత ప్లేయర్
- 145 బంతుల్లో 12 ఫోర్లతో తొలి అంతర్జాతీయ సెంచరీ నమోదు

ప్రజాక్షేత్రం:
భారత మహిళా వికెట్ కీపర్‌బ్యాటర్ యస్తికా భాటియా చరిత్ర సృష్టించింది. ప్రఖ్యాత లార్డ్స్ క్రికెట్ గ్రౌండ్‌లో టెస్ట్ సెంచరీ సాధించిన తొలి మహిళా క్రికెటర్‌గా ఆమె సరికొత్త రికార్డు నెలకొల్పింది. ఇంగ్లండ్‌తో జరుగుతున్న ఏకైక టెస్ట్ మ్యాచ్‌లో మూడో రోజైన ఆదివారం యస్తికా ఈ అరుదైన ఘనతను అందుకుంది.

ఇంగ్లండ్ తో ఏకైక టెస్టులో లంచ్ విరామానికి 91 పరుగులతో క్రీజులో ఉన్న యస్తికా, తిరిగి ఆట మొదలయ్యాక ఏమాత్రం ఒత్తిడికి గురికాలేదు. ఇంగ్లండ్ పేసర్ ఇస్సీ వాంగ్ బౌలింగ్‌లో వరుసగా రెండు ఫోర్లు బాది, ఆపై కవర్స్ దిశగా సింగిల్ తీసి తన తొలి అంతర్జాతీయ శతకాన్ని పూర్తి చేసుకుంది. 145 బంతుల్లో 12 ఫోర్ల సహాయంతో ఆమె ఈ సెంచరీని నమోదు చేసింది. సెంచరీ పూర్తికాగానే యస్తికా భావోద్వేగంతో మైదానంలో మోకాళ్లపై కూర్చొని పిచ్‌ను ముద్దాడింది. స్టేడియంలోని ప్రేక్షకులంతా లేచి నిలబడి చప్పట్లతో ఆమెను అభినందించారు.


కెరీర్‌ను ప్రమాదంలో పడేసిన మోకాలి (ఏసీఎల్) గాయం నుంచి కోలుకొని ఈ ఇంగ్లండ్ పర్యటనతోనే యస్తికా అంతర్జాతీయ క్రికెట్‌లోకి పునరాగమనం చేసింది. ఈ చారిత్రక ఇన్నింగ్స్‌తో తన పునరాగమనాన్ని ఘనంగా చాటుకుంది. ఆట ప్రారంభమైన తొలి బంతికే లారెన్ బెల్ వేసిన బంతి వికెట్లను తాకినా బెయిల్స్ కింద పడకపోవడంతో యస్తికా అదృష్టవశాత్తు బతికిపోయింది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని అద్భుత ఇన్నింగ్స్ ఆడింది.

ఇదే మ్యాచ్‌లో ఐదు వికెట్ల ప్రదర్శనతో ఇప్పటికే లార్డ్స్ ఆనర్స్ బోర్డుపై చోటు సంపాదించిన తన సహచర క్రీడాకారిణి క్రాంతి గౌడ్ సరసన యస్తికా కూడా చేరింది.




## డబ్బు గుంజేందుకే నా పరువు తీశారు

- తప్పుడు ఎఫ్ఐఆర్‌తో తనను బ్లాక్‌మెయిల్ చేశారన్న శశాంక్ సింగ్
- డబ్బు గుంజడానికే పరువు తీసే కుట్ర జరిగిందని ఆరోపణ
- పనిలో పెట్టుకున్న వ్యక్తికి 9 కేసుల నేర చరిత్ర ఉందని వెల్లడి
- మా వాదన వినకుండానే కేసు నమోదు చేశారంటూ ఆవేదన




ప్రజాక్షేత్రం:
ఐపీఎల్ ఫ్రాంచైజీ పంజాబ్ కింగ్స్ క్రికెటర్ శశాంక్ సింగ్ తనపై, తన కుటుంబంపై ఇటీవల నమోదైన కేసుపై తాజాగా స్పందించాడు. సెలబ్రిటీగా తనకున్న పేరును దెబ్బతీసి, డబ్బు గుంజేందుకే ఓ వ్యక్తి తప్పుడు ఎఫ్ఐఆర్ నమోదు చేశారని సంచలన ఆరోపణలు చేశాడు. తనపై దాడి జరిగిందంటూ ఓ వంట మనిషి పెట్టిన కేసు పూర్తిగా కట్టుకథ అని, ఇది పరువు తీసి డబ్బు రాబట్టేందుకు పన్నిన కుట్ర అని సోషల్ మీడియాలో ఒక సుదీర్ఘ పోస్ట్ ద్వారా వివరించాడు.

గత నెలలో భోపాల్‌లోని తమ నివాసంలో పనిచేసే వంట మనిషిపై దాడి చేసి, ఫోన్ లాక్కున్నారని శశాంక్ సింగ్, ఆయన తండ్రి, రిటైర్డ్ స్పెషల్ డీజీపీ శైలేష్ సింగ్‌పై రతిబాద్ పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ ఆరోపణలను శశాంక్ పూర్తిగా ఖండించాడు.

"నిజానిజాలు తెలుసుకోకుండా వేలమంది నన్ను దూషించారు. ఒక నిరుపేదను కొట్టిన వ్యక్తిగా నన్ను చిత్రీకరించారు. ఈ ఘటన నన్ను మార్చేసింది, జీవితాంతం గుర్తుంచుకునే పాఠాలు నేర్పింది" అని ఆవేదన వ్యక్తం చేశాడు.

తమ వద్ద పనికి చేరిన వ్యక్తి ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండేదని, ఇంట్లో తిరుగుతూ ఫొటోలు తీసి ఇతరులకు పంపేవాడని శశాంక్ తెలిపాడు. దీంతో మూడో రోజే అతడిని పనిలో నుంచి పంపించేశామని, అప్పుడు అతను ఆరోగ్యంగానే వెళ్లాడని స్పష్టం చేశాడు. "ఆ తర్వాత అతడు తీవ్రంగా గాయపడినట్లు వీడియోలో చూసి మేం షాక్ అయ్యాం. పోలీసు రికార్డుల ప్రకారం అతనిపై అప్పటికే హత్యాయత్నం, గృహ చౌర్యం, దాడి, బెదిరింపులు, ఎస్సీ/ఎస్టీ చట్టం కింద కేసులు సహా మొత్తం 9 ఎఫ్ఐఆర్‌లు నమోదై ఉన్నాయి. తన గుర్తింపును దాచుకోవడానికి మూడు వేర్వేరు పేర్లు వాడుతున్నాడు" అని శశాంక్ వెల్లడించాడు.

ఒక తప్పుడు ఎఫ్ఐఆర్ నమోదు చేయడం ద్వారా తనపై ఒత్తిడి తెచ్చి, డబ్బు రాబట్టుకోవాలన్నదే అతని ప్రణాళిక అని తాను నమ్ముతున్నానని శశాంక్ పేర్కొన్నాడు. "సాధారణ బాధితులు ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికే ఇబ్బంది పడుతుంటే, మా వైపు వాదన వినకుండానే ఇంత వేగంగా కేసు ఎలా నమోదు చేశారని ఆశ్చర్యపోయాను" అని అన్నాడు.

ఏప్రిల్ 30న కూడా తాను ఇలాంటి పనే చేశానని వస్తున్న వార్తలను కొట్టిపారేశాడు. ఆ రోజు తాను ఐపీఎల్ మ్యాచ్ ఆడుతున్నానని, కనీస నిజ నిర్ధారణ లేకుండా వార్తలు రాసి పరువు తీస్తున్నారని విమర్శించాడు.

ఈ అనుభవంతో కొన్ని కఠినమైన పాఠాలు నేర్చుకున్నానని చెబుతూ, ప్రజలకు శశాంక్ ఒక ముఖ్యమైన సూచన చేశాడు. "ఇంట్లో పనిచేసే వారిని నియమించుకునే ముందు రిజిస్టర్డ్ ఏజెన్సీల ద్వారా, పూర్తి పోలీసు వెరిఫికేషన్ తర్వాతే తీసుకోవాలి. జాలి అనేది ఇంగితజ్ఞానాన్ని భర్తీ చేయకూడదు. సత్యానికి సమయం పట్టినా, చివరికి అదే గెలుస్తుంది" అని చెప్పుకొచ్చాడు.

# అమ్మాయిల అంటే పిచ్చి..

- సొంత కొడుకు ఉంగరం మింగినా పట్టించుకోలేదు..
- వెలుగులోకి దైవాలగూడ రాజ్ కుమార్ కృూరత్వం..
- ఆరు హత్యల ఘటనలో షాబాద్ సీఐ సస్పెండ్..!
- నిందితుడ్ని పట్టిస్తే రూ.2 లక్షల బహుమతి
- హంతకుడు రాజ్ కుమార్ చిక్కలేదు





వికారాబాద్ జులై 12(ప్రజాక్షేత్రం):
రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం దైవాలగూడ ప్రాంతంలో ఆరుగురుని హత్య చేసిన రాజ్ కుమార్ నేపథ్యం చాలా క్రూరంగా ఉంది. ఈ హత్యలు జరిగిన తర్వాత.. అతడి గురించి పోలీసులు దర్యాప్తు జరుపుతుంటే దారుణమైన నిజాలు వెలుగులోకి వస్తున్నాయి.. రాజ్ కుమార్ ప్రేమించి పెళ్లి చేసుకున్నప్పటికీ.. ఆమెను నిత్యం వేధిస్తుండేవాడు. ఇద్దరు మగ పిల్లలు పుట్టినప్పటికీ.. వారి ఆలనా పాలనా అతడు చూసుకునేవాడు కాదు. పైగా అమ్మాయిలు అంటే పిచ్చిగా వ్యవహరించేవాడు.

రాజ్ కుమార్ ప్రేమిస్తున్నానని చెబితే సరిత నిజమని నమ్మింది. అతడితో ఏడడుగులు వేసింది. ఆ తర్వాత అతడి అసలు స్వరూపాన్ని చూసి ప్రతిరోజు ఏడ్చేది. ఇద్దరు పిల్లలు పుట్టినప్పటికీ రాజ్ కుమార్ తన ప్రవర్తన మానుకోలేదు. చివరికి తన కుమారుడు ఇటీవల రింగ్ మింగాడు. అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అయినప్పటికీ రాజ్ కుమార్ తన కుమారుడిని పట్టించుకోలేదు. అతడు అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నప్పటికీ ఆసుపత్రికి తీసుకెళ్లలేదు.

మొదటి నుంచి కూడా రాజ్ కుమార్ దైవాలగూడ .. ఇతర ప్రాంతాలలో అమ్మాయిలను వేధించేవాడట. ఇదే విషయాన్ని అతడి సొంత కుటుంబ సభ్యుల చెబుతున్నారు. వివాహ విషయంలో కూడా అనేక గొడవలు జరిగినట్టు సమాచారం. రాజ్ కుమార్ భార్య సరితకు గతంలో వేరే సంబంధం వచ్చింది. ఆ సంబంధాన్ని రాజ్ కుమార్ చెడగొట్టాడు. ప్రేమించినట్టు చెప్పి.. ఆమె వెంటపడ్డాడు. వేధించాడు. ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించి .. సరితను లొంగదీసుకున్నాడు. ఆమెను బెదిరించి పెళ్లి చేసుకున్నాడు. వివాహం జరిగిన తర్వాత సరితను అతడు నిత్యం వేధించేవాడు. అందంగా లేవని.. శరీర సౌష్టవం బాగోలేదని ఇబ్బంది పెట్టేవాడు. అనేక పర్యాయాలు గొడవలు జరిగాయి. ఆ సమయంలో సరితని విడాకులు తీసుకుని రావాలని ఆమె కుటుంబ సభ్యులు చెప్పారు. అయితే తన భర్త మారతాడని సరిత భావించింది. కానీ అతడు సరితను.. ఆమె ఇద్దరు పిల్లల్ని చంపేశాడు.

ఫోక్సో కేసు పెట్టిన బాలిక.. ఆమె తల్లి.. నానమ్మ... తో రాజ్ కుమార్ స్నేహంగానే ఉండేవాడు. ఆ బాలిక తండ్రి తో స్నేహాని కొనసాగించేవాడు. అయితే ఆ బాలికతో రాజ్ కుమార్ అనేక సందర్భాల్లో వంకర బుద్ధితో మాట్లాడేవాడు. ఈ నేపథ్యంలో అతడి తీరును ఆ బాలిక తండ్రి అనేక సందర్భాల్లో తప్పుపట్టాడు. అంతేకాదు ఇటీవల ఆ బాలిక ఇంటి పెద్ద చనిపోయాడు. మద్యం తాగే అలవాటు ఉన్న నేపథ్యంలో అతడు చనిపోయి ఉంటాడని కుటుంబ సభ్యులు అనుకున్నారు. అయితే కొద్ది రోజుల తర్వాత రాజ్ కుమార్ అతను చనిపోవడానికి కారణమని వారు అనుమానం వ్యక్తం చేశారు.. ఆ ఇంటి పెద్ద చనిపోయిన తర్వాత రాజ్ కుమార్ తరచూ అక్కడికి వెళ్లేవాడు. ఆ బాలికతో దారుణంగా ప్రవర్తించేవాడు. తమ ఇంటికి రావద్దని ఆ బాలిక కుటుంబం అతడి ముఖం మీద చెప్పేసింది.

ఈ నేపథ్యంలో ఆ బాలిక ఇంటిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలకు తన ఫోన్ కనెక్ట్ చేసుకున్నాడు రాజ్ కుమార్. ప్రతి విషయం మీద కూడా అతడు ఆరా తీసేవాడు. ఇంట్లోకి ఎవరు వస్తున్నారో నిత్యం గమనించేవాడు. ఇదంతా భరించలేక వారు ఆ బాలికను కాలేజీ మాన్పించారు. పరీక్షలు జరుగుతున్నప్పుడు ఆ బాలికను కాలేజీ వద్దకు తీసుకెళ్లేవారు. ఈ విషయం తెలుసుకున్న రాజ్ కుమార్.. ఆ బాలికతో అసభ్యంగా ప్రవర్తించాడు. కాలేజీ మానేయాలని కోరాడు. ఆమె చేయి పట్టుకుని లాగాడు. ఆ సమయంలో ఆ బాలిక తల్లి రాజ్ కుమార్ ను తిట్టింది.

ఆ బాలిక కాలేజీకి వెళ్తున్నప్పుడు రాజ్ కుమార్ గట్టి వార్నింగ్ ఇచ్చాడు. అదే సమయంలో మీ ఇంటి పెద్దను చంపినట్టే.. మీ అందరిని కూడా అంతం చేసి ఆ బాలికను తీసుకుపోతానంటూ వార్నింగ్ ఇచ్చాడు. ఆ సమయంలో ఆ బాలిక కుటుంబ సభ్యులకు.. తమ ఇంటి పెద్దను రాజ్ కుమార్ హత్య చేశాడని తెలుసుకొని ఒకసారిగా దిగ్భ్రాంతికి గురయ్యారు. దీంతో వారు రాజ్ కుమార్ మీద పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు అతని మీద ఫోక్సో కేసు పెట్టారు. అప్పటి నుంచి రాజ్ కుమార్ పరారీలో ఉన్నాడు. కేసు నమోదు అయిన నాటి నుంచి పరారీలో ఉన్న రాజ్ కుమార్.. బెయిల్ కోసం విపరీతంగా ప్రయత్నించాడు. చివరికి బేల్ రావడంతో సరిగా 15 రోజుల క్రితం సొంత ఊరికి వచ్చాడు. వచ్చిన నాటి నుంచి నిశ్శబ్దంగా ఉన్నాడు. సొంత కుమారుడు రింగు మింగినప్పటికీ.. ఆస్పత్రికి తీసుకెళ్లకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించాడు. చివరికి ఆరుగురిని చంపేసి.. తన క్రూరత్వాన్ని బయట పెట్టుకున్నాడు.

**ఆరు హత్యల ఘటనలో షాబాద్ సీఐ సస్పెండ్..!**

**నిందితుడ్ని పట్టిస్తే రూ.2 లక్షల బహుమతి**

అత్యంత క్రూరంగా 6 మంది ప్రాణాలు తీసిన షాబాద్ ఘటనలో పోలీసులపై ఎట్టకేలకు వేటు పడింది. నిర్లక్ష్యంగా వ్యవహరించిన సీఐ క్రాంతి రెడ్డిని సస్పెండ్ చేశారు. రంగారెడ్డి జిల్లా షాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన అత్యంత అమానవీయ ఘటనలో పోలీసుల తీరుపై మొదటి నుండి అనుమానాలు వ్యక్తమవుతూనే ఉన్నాయి. రాజ్ కుమార్ అనే నిందితుడు తమ బిడ్డను వేధిస్తున్నాడంటూ బాధితురాలి కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసినా, పోలీసులు లైట్ తీసుకున్నారంటూ మృతుల బంధువులు ఉదయం నుండి నిరసనలు చేస్తూనే ఉన్నారు. షాబాద్ స్టేషన్ బయట బైఠాయించి, ఎస్సై, సీఐలపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో ఆరుహత్యల ఘటనలో స్థానిక సీఐ క్రాంతి రెడ్డి నిర్లక్ష్యం ఉందని ప్రాథమికంగా నిర్ధారించుకున్న పోలీసుఉన్నతాధికారులు సీఐపై సస్పెన్షన్ వేటు వేశారు.

**పోలీసులు సీరియస్ గా తీసుకోలేదా..**

మే 16వ తేదిన తమ బిడ్డను రాజ్ కుమార్ వేధిస్తున్నాడంటూ షాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు మైనర్ బాలిక తల్లిదండ్రులు. ఫిర్యాదు తీసుకున్న పోలీసులు పోక్సో చట్టం క్రింద నిందితుడిపై కేసు నమోదు చేసినట్లుగా తెలుస్తోంది. అయితే కేసు నమోదైన రెండు రోజుల తరువాత నిందితుడు రాజ్ కమార్ ఊరిలో తిరుగుతూ కనిపించడంతో మైనర్ బాలిక కుటుంబ సభ్యులకు అనుమానం వచ్చి పోలీసులను నిలదీశారు. పోక్సో కేసు నమోదు చేశారు. రెండు రోజుల్లో బెయిల్ ఎలా వస్తుంది. దర్జాగా బయట తిరుగుతూ మమ్మల్ని చంపేస్తామని బెదిరిస్తున్నాడంటూ వాపోయారు. అయితే పోలీసులు మాత్రం ఈ విషయంపై అంత సీరియస్ గా దృష్టిసారించకపోవడం మాత్రమే కాకుండా, మేం చూసుకుంటా, వార్నింగ్ ఇచ్చాం, మీరు వెళ్లండి అంటూ చెప్పి పంపేశారట.

అలా పోలీసుల అండతో రెచ్చిపోయిన రాజ్ కుమార్ శనివారం రాత్రి మైనర్ బాలిక ఇంటి వెళ్లి రక్తపాతం సృష్టించాడు. మృగంలా మారి ఆరుగురి కిరాతకంగా హతమార్చాడు. చెప్పి మరీ చంపేశాడని,పోలీసులు సీరియస్ గా కేసులో వ్యవహరించకపోవడంతోనే ఇంత ఘోరం జరిగిందని మృతుల కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. షాబాద్ సీఐ క్రాంతి రెడ్డితోపాటు ఎస్సైపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితుల ఆరోపణలపై విచారణ చేపట్టిన ఉన్నతాధికారులు సీఐ క్రాంతి రెడ్డిని సస్పెండ్ చేశారు.

**నిందితుడి ఆచూకీ చెబితే**

**2 లక్షల బహుమతి : పోలీస్ కమిషనర్**

గత రాత్రి షాబాద్ లో ఆరుగురుని అత్యంత కిరాతకంగా చంపి, తల్లిదండ్రులకు ఫోన్ చేసి చెప్పిమరీ పరారైన రాజ్ కుమార్ కోసం తెల్లవారుజాము నుండి 8 పోలీసులు బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. షాబాద్ పోలీస్టేషన్ పరిధిలోని గ్రామాలను జల్లెడ పడుతున్నారు. రాజ్ కుమార్ కుటుంబ సభ్యులు, బంధువులు,స్నేహితులు.. ఇలా ఎవరీ వదలకుండా , అనుమానం వచ్చిన ప్రతీ ఒక్కరినీ విచారిస్తున్నారు. ఉదయం 6గంటల సమయంలో షాబాద్ శివారు నుండి రైల్వే స్టేషన్ కు వెళ్లినట్లు గుర్తించారు. తాజాగా నందిగామలో రాజ్ కుమార్ కారు ఉన్నట్లుగా పోలీసులకు సమాచారం అందింది. ఇప్పటి వరకూ నిందితుడి ఆచూకీ ఎక్కడా లభించలేదు. ఇప్పటికే తెలంగాణ పోలీసులకు ఈ కేసు పెను సవాలుగా మారింది. పోలీసుల నిర్లక్ష్యం వల్లే ఆరుగురు హత్యకు గురైయ్యారంటూ ప్రతిపక్షాలు విమర్శలతో విరుచుకుపడుతున్నాయి. ఈ నేపథ్యంలో నిందితుడు రాజ్ కుమార్ ను అదుపులోకి తీసుకోవడం పోలీసులకు పెను సవాలుగా మారింది.

రాజ్ కుమార్ ఆచూకి తెలుసుకునేందుకు ఉపయోగపడే కీలక సమాచారం ఇచ్చిన వారికి రెండు లక్షల రూపాయల నగదు బహుమతి ఇస్తామని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచుతామని పోలీస్ కమీషనర్ ఓ ప్రకటన ద్వారా తెలిపారు. నిందితుడ్ని పట్టుకునేందుకు అవసరమైన సమాచారం ఇచ్చినవారికి అవసరమైన భద్రత కల్పిస్తామంటున్నారు. నిందితుడి గురించి వివరాలు చెప్పాలనుకునేవారు చేవళ్ల పోలీస్ కంట్రోల్ రూమ్ నెంబర్ . 8712665324 కు ఫోన్ కాల్ లేదా వాట్సప్ ద్వారా సమాచారం ఇవ్వొచ్చని తెలిపింది ఫ్యూచర్ సిటీ కమీషనరేట్

### హంతకుడు రాజ్ కుమార్ చిక్కలేదు

**- చేవెళ్ల డీసీపీ యోగేష్ గౌతం**

రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం దైవాలగూడలో సంచలనం సృష్టించిన ఆరు హత్యల కేసు నిందితుడు రాజ్‌కుమార్ పోలీసులకు చిక్కాడంటూ జరుగుతున్న ప్రచారంపై చేవెళ్ల డీసీపీ యోగేష్ గౌతం స్పందించారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ''షాబాద్ ఆరు హత్యల కేసులో దర్యాప్తును వేగవంతం చేశాము. నిందితుడి కోసం మొత్తం తొమ్మిది బృందాలతో గాలిస్తున్నాం. నిందితుడు చేగురు రైల్వే ట్రాక్ దాటి అడవి ప్రాంతంలోకి వెళ్లినట్లు అనుమానిస్తున్నాం. రాజ్‌కుమార్ తన మొబైల్ ఫోన్‌ను శుక్రవారం రాత్రి 11:47 స్విచ్ ఆఫ్ చేశాడు. సోషల్ మీడియాలో వస్తున్న వదంతులు నమ్మవద్దు. రాజ్‌కుమార్ కోసం రైల్వే పోలీస్, ట్రాకింగ్ టీమ్, హ్యూమన్ ఇన్వెస్టిగేషన్, టెక్నికల్ టీమ్స్‌తో 9 బృందాలు గాలిస్తున్నాయి. రాజ్ కుమార్ పోలీసులకు చిక్కినట్టు మీడియాలో వస్తున్న విషయం వాస్తవం కాదని స్పష్టం చేశారు.

# కొమురవెల్లికి రైలు విజిల్..

- కొమురవెల్లి మల్లన్న భక్తులకు శుభవార్త..
- జూలై 26 నుంచి రైలులోనే పుణ్యక్షేత్రానికి ప్రయాణం
- నూతన రైల్వే స్టేషన్ను ప్రారంభించనున్న కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

కొమురవెల్లి, జూలై 12(ప్రజాక్షేత్రం):
కొమురవెల్లి శ్రీ మల్లికార్జున స్వామి (మల్లన్న) ఆలయానికి వచ్చే లక్షలాది మంది భక్తులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న కొమురవెల్లి రైల్వే స్టేషన్ నిర్మాణం పూర్తికాగా, ఈ నెల జూలై 26 శనివారం కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జీ. కిషన్ రెడ్డి చేతుల మీదుగా నూతన రైల్వే స్టేషన్ ప్రారంభం కానుంది. ప్రారంభోత్సవం అనంతరం అదే రోజు నుంచి స్టేషన్‌లో ప్రయాణికుల రైళ్లకు అధికారికంగా హాల్ట్ కల్పించనున్నారు. ప్రారంభ దశలో రోజుకు రెండు జతల ప్రయాణికుల రైళ్లు కొమురవెల్లి మీదుగా నడవనున్నాయి. రైలు సర్వీసులు సికింద్రాబాద్-కొమురవెల్లి-సిద్దిపేట మరియు సిద్దిపేట-కొమురవెల్లి-సికింద్రాబాద్ మార్గాల్లో రాకపోకలు సాగించనున్నాయి. దీంతో హైదరాబాద్, సికింద్రాబాద్, సిద్దిపేటతో పాటు పరిసర ప్రాంతాల భక్తులు రోడ్డు మార్గంపై ఆధారపడకుండా నేరుగా రైలులోనే కొమురవెల్లికి చేరుకునే అవకాశం లభించనుంది. కొమురవెల్లి శ్రీ మల్లన్న ఆలయం తెలంగాణలోని ప్రముఖ శైవక్షేత్రాల్లో ఒకటి. ప్రతి సంవత్సరం సంక్రాంతి జాతరతో పాటు వివిధ ప్రత్యేక పూజలు, ఉత్సవాల సందర్భంగా రాష్ట్రం నలుమూలలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా లక్షలాది మంది భక్తులు ఆలయాన్ని సందర్శిస్తుంటారు. ఇంతకాలం ప్రధానంగా రోడ్డు మార్గంపైనే ప్రయాణించాల్సి రావడంతో ట్రాఫిక్ సమస్యలు ఎదురయ్యేవి. రైల్వే స్టేషన్ అందుబాటులోకి రావడంతో భక్తుల ప్రయాణం మరింత సులభతరం కానుంది.భవిష్యత్తులో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈ మార్గంలో మరిన్ని రైళ్లను నడిపే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు రైల్వే వర్గాలు వెల్లడించాయి. అలాగే స్టేషన్‌లో అదనపు ప్రయాణికుల సౌకర్యాలు, మౌలిక వసతుల అభివృద్ధికి కూడా చర్యలు చేపట్టనున్నట్లు సమాచారం.

కొమురవెల్లి రైల్వే స్టేషన్ ప్రారంభం వల్ల భక్తులకు మాత్రమే కాకుండా స్థానిక ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు ఈ ప్రాంత పర్యాటకం, వాణిజ్యం, ఆర్థికాభివృద్ధికి కూడా కొత్త ఊతం లభిస్తుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.




Printed, Published and Owner by K PRAVEEN KUMAR, Printed at MR Publications, A-20, Vambay Colony, Upparpally, Ranga Reddy (Dist), Hyderabad, Telangana 500048. Published at H.NO. 2-50 Shankar pally, Ranga Reddy. Hyderabad, Telangana 501203. Editor: KPRAVEEN KUMAR. Phone number 9177920459, email id: prajakshetram1@gmail.com, https://prajakshetram.com PRGI NO. TGTEL/25/A2394